బుధవారం
01-05-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 309
పేజీలు : 8+టాబ్లాయిడ్, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

హత్యకేసులో భారతీయుడికి జీవితఖైదు

లండన్: భార్య హత్య కేసులో ఓ భారతీయుడికి లండన్ కోర్టు జీవిత ఖైదు విధించింది. గతేడాది జరిగిన ఈ ఘటనలో తాజాగా కోర్టు తీర్పునిచ్చింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. భారత్‌కు చెందిన సాహిల్ శర్మ(24) మెహక్ (19)కు గతేడాది వివాహం జరిగింది. వీరు లండన్‌లోని క్రోయిడాన్‌లో నివాసముంటున్నారు. సాహిల్ తన భార్యను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న మెహక్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో న్యాయస్థానం ఎదుట తన భార్యను తానే హత్య చేసినట్లు సాహిల్ అంగీకరించాడు.

సంక్షేమం... సమగ్రాభివృద్ధి

- 20 లక్షల ఉద్యోగాలు
- రూ.3 వేల నిరుద్యోగ భృతి
- వృద్ధులకు రూ.4 వేలు
- వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్
- మెగా డీఎస్సీ
- ఆస్తులు అమ్మి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం
- ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు, పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్షేమం, సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎన్‌డీఏ ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించామని టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మంగళవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో వారు ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు సిద్ధార్థనాథ్ సింగ్ కూడా పాల్గొన్నారు. అయితే బీజేపీకి జాతీయస్థాయిలో ఎన్నికల మేనిఫెస్టో ఉన్నందున, రాష్ట్రాలకు సంబంధించి పోటీ చేసే పార్టీలు విడుదల చేసే మేనిఫెస్టోల్లో భాగస్వామ్యం కాకుండా వాటి అమలుకు పూర్తిగా సహకారం అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్‌డీఏ కూటమి నేతలకు వచ్చిన సూచనలు, వినతులు, యువగళంలో వచ్చిన సూచనలు, జనవాణి రూపంలో జనసేనకు వచ్చిన వినతులు, ఆన్‌లైన్‌లో వచ్చిన సూచనలన్నీ క్రోడీకరించి ఈ ప్రజా మేనిఫెస్టో తయారుచేశామని చంద్రబాబు, పవన్ వివరించారు. సంపద సృష్టికి మూలమైన ప్రజారాజధాని అమరావతి నిర్మాణంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి, పోలవరంతో సహా మిగిలిన సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యమిస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలను మీడియాకు వివరించారు.

సూపర్ సిక్స్ పథకాలు

సూపర్ సిక్స్ పథకాల పేరుతో యువతకు 20 లక్షల ఉద్యోగాలు/నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 (19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు), ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారు.

షణ్ముఖ వ్యూహం

సూపర్ సిక్స్ 2.0/షణ్ముఖ వ్యూహంలో భాగంగా ఇంటింటికీ రక్షిత తాగునీరు, పూర్ టు రిచ్ కింద పేదలను సంపన్నులను చేసే దిశగా

- మిగతా 2 లో

కత్తి మొనపై ఏపీ భవిష్యత్ 2లో

కార్మిక వర్గానికి మేడే శుభాకాంక్షలు

మరో భారీ ఎన్‌కౌంటర్

తొమ్మిదిమంది మావోయిస్టుల మృతి

రాయ్‌పూర్/ చింతూరు : లోక్‌సభ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం మరోసారి తుపాకీ కాల్పులతో దద్దరిల్లింది. కాంకేర్, నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని తెక్‌మేట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు నిఘావర్గాల ద్వారా సమాచారం అందటంతో

- మిగతా 2 లో

రేవంత్‌కు బదులు మోదీ, అమిత్‌షాకు

ఈసీ నోటీసులివ్వాలి

- ప్రధాని దిగజారుడు రాజకీయాలు
- తెలంగాణలో బీఆర్ఎస్‌కు జీరో సీట్లు: నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వడానికి బదులుగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. స్థానిక మఖ్దుంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నర్సింహాతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే ఢిల్లీ, జార్ఖండ్ సీఎంలను ఇప్పటికే జైలులో పెట్టారని, తెలంగాణ సీఎం రేవంత్‌ను జైలులో పెట్టేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యర్థులు లేకుండా బీజేపీ కొత్త పన్నాగం పన్నుతోందని దుయ్యబట్టారు. ఢిల్లీ పోలీసులు రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు. సోషల్ మీడియాలో వచ్చే వాటిని పరిశీలించేందుకు కేంద్ర మంత్రి అమిత్ షా కేంద్ర పరిధిలో ఉండే ఢిల్లీ పోలీసులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించారన్నారు. ఢిల్లీ పోలీసులతో సంబంధం లేకపోయినా వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీకి వ్యతిరేకంగా కర్నాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలలో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని, ఆయనను నియంత్రించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. సాక్షాత్తూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ముస్లింల రిజర్వేషన్లను తీసివేస్తామని అమిత్ షా చెబుతున్నారని, ఆర్ఎస్ఎస్ ప్రాథమిక విధానాలను బీజేపీ అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండియా కూటమి గెలిస్తే ఆస్తులను, స్త్రీల మంగళ సూత్రాలను స్వాధీనం చేసుకుంటారనే వ్యాఖ్యలతో మోదీ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని అన్నారు. భార్య మంగళసూత్రానికి విలువ ఇవ్వని మోదీ, మంగళసూత్రం గురించి మాట్లాడడమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. ముస్లింలు ప్రమాదకారులే

- మిగతా 2 లో

విజయవాడలో

తీవ్ర విషాదం

- వైద్యుడితో సహ ఐదుగురి అనుమానాస్పద మృతి
- ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసుల అనుమానం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్) : విజయవాడలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ వైద్యుడి కుటుంబం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లో వైద్యుడి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు కత్తులతో పొడిచిన తీవ్రగాయాలతో చనిపోయారు. వైద్యుడు మాత్రం ఇంటి వరండాలో ఉరి వేసుకుని మరణించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ సభ్యులను వైద్యుడే చంపి, ఆ తర్వాత ఆయన ఉరి వేసుకుని చనిపోయి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. నగరంలో సంచలనం

- మిగతా 2 లో

బ్రిటన్ భారతీయుల్లో మోదీపై వ్యతిరేకత

52 శాతం మందిలో అసంతృప్తి... సర్వే వెల్లడి

బ్రిటన్‌లో నివసిస్తున్న భారతీయుల్లో 52శాతం మందికి ప్రధాని నరేంద్రమోదీపై వ్యతిరేకత ఉన్నట్లు ఓ సర్వే వెల్లడించింది. సర్వేలో పాల్గొన్న వారిలో యాభై శాతం మంది హిందువులు హిందుత్వ సూత్రాలను తిరస్కరించారు. 2లో

చంద్రబాబు హామీలు బూటకం

- ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోపై మోదీ ఫొటో ఏది?
- బీజేపీ అధిష్ఠానం వద్దని చెప్పిందా?
- ఎన్నికల సభల్లో జగన్ వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోపై సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధిష్ఠానం చంద్రబాబుకు ఫోన్ చేసింది... మేనిఫెస్టోలో మీ ఫొటోలు పెట్టుకోండి... మోదీ ఫొటో పెడితే ఒప్పుకోబోమని చెప్పినట్టుంది... అందుకే ఆయన ఫొటో పెట్టలేదంటూ జగన్ ఆరోపించారు. చంద్రబాబు హామీలు మోసమే అని తేలిపోయిందని, కూటమిలోని ముగ్గురు నాయకుల ఫొటోలు పెట్టుకునే పరిస్థితిలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన టంగుటూరు, మైదుకూరు, కలికిరిలో వైసీపీ ఏర్పాటు చేసిన సభల్లో పాల్గొని మాట్లాడారు. మీ బిడ్డ హయాంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అమలయ్యాయి... చంద్రబాబు పాలనలో ఎలాంటి మోసాలు జరిగాయో ఆలోచించాలన్నారు. పోలింగ్ రోజు సరైన

- మిగతా 2 లో

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు

నేరస్తులకు జగన్ టికెట్లు

కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శ

విశాలాంధ్ర-అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్‌లో హత్యా రాజకీయాలు పేట్రేగిపోతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి విమర్శించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా షర్మిల మాట్లాడుతూ దళితులకు గుండు గీసిన, బాబాయిని హత్య చేసిన వారికి వైసీపీ టికెట్లు ఇచ్చి...హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ఐదేళ్ల క్రితం ఎన్నో హామీలు ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి...రాష్ట్రానికి ఏమీ చేయలేకపోయారన్నారు. కుంభకర్ణుడు ఆరు నెలలు నిద్రలో ఉంటాడని, ముఖ్యమంత్రి జగన్‌కు ఐదేళ్లు కూడా సరిపోలేదన్నారు. మద్యనిషేధం చేస్తానని చెప్పి తానే నాసిరకం మద్యం అమ్ముతూ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని షర్మిల ఆరోపించారు. డిజిటల్ పేమెంట్స్ కాకుండా నగదుకు మాత్రమే మద్యం అమ్మి కోట్ల రూపాయలు పన్ను ఎగ్గొడుతున్నారన్నారు. బటన్

- మిగతా 2 లో

ఎన్నికల ముందే కేజ్రీవాల్

అరెస్టు ఎందుకు?

- ఈడీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- కేజ్రీవాల్ బెయిల్‌పై కొనసాగుతున్న విచారణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ ఎన్నికలకు కేవలం కొద్దిరోజుల ముందు కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్ట్ చేశారనే ప్రశ్నలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమాధానం చెప్పాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ తనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడాన్ని సవాల్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇందులో బిర్యానీ రైస్ పెట్టాం. గెలిపిస్తే స్టౌ మీద పెడతాం..హో!

కలవరం!

- స్వతంత్రులకు గాజుగ్లాసు
- హైకోర్టులో జనసేన పిటిషన్
- ఎన్డీఏ కూటమిలో ఆందోళన
- ఈసీ నిర్ణయంపై ఉత్కంఠ
- నేటికి విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గాజుగ్లాసు గుర్తు స్వతంత్రులకు కేటాయించడంపై ఎన్డీఏ కూటమి పార్టీలు కలవరం చెందుతున్నాయి. జనసేనతో బలం పుంజుకుని ఎన్నికల్లో గెలుపొందాలన్న ఆశయంతో పొత్తులకు దిగిన టీడీపీ, బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. గాజుగ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ మంగళవారం జనసేన హైకోర్టును ఆశ్రయించింది. తమ పార్టీ పోటీలోలేని చోట గాజుగ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు, ఇతర పార్టీలకు కేటాయించడంపై ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని పిటిషన్‌లో పేర్కొంది. దీంతో జనసేన ఇచ్చిన అభ్యర్థనపై 24 గంటల్లో ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుందని ఈసీ తరపు న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. దీనిపై విచారణను బుధవారం నాటికి హైకోర్టు వాయిదా

- మిగతా 2 లో



విజయవాడలో తీవ్ర విషాదం

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించిన ఈ విషాద ఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... పటమట వాసవీనగర్ 9వ లైనులో డాక్టర్ ధారవత్ శ్రీనివాస్ (40) తన తల్లి రమణమ్మ (66), భార్య ఉషారాణి (36), కుమార్తె శైలజ (9), కుమారుడు శ్రీహాన్ (5) తో కలిసి నివాసం ఉంటున్నారు. డాక్టర్ శ్రీనివాస్ నగరంలోని జమ్మిచెట్టు సెంటర్‌లో ఒక ప్రైవేట్ ఆర్థోపెడిక్ హాస్పటల్ నిర్వహిస్తున్నారు. ఆయన తండ్రి జమలయ్య నాయక్ విజయవాడ ఏసీపీగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. సోదరుడు దుర్గాప్రసాద్ హైదరాబాదులో జడ్జిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం డాక్టర్ శ్రీనివాస్ ఇంటికి పని మనిషి వెళ్లగా, వరండాలో ఆయన ఉరికి వేలాడుతూ కనిపించారు. దీంతో పని మనిషి ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పటమట పోలీసులు వచ్చి లోపలికి వెళ్లి చూడగా తల్లి రమణమ్మ, భార్య ఉషారాణి, కుమార్తె శైలజ, కుమారుడు శ్రీహాన్ కూడా మృతి చెంది ఉన్నారు. వారి ఒంటిపై కత్తితో చేసిన గాయాలు ఉన్నాయి. డాక్టర్ శ్రీనివాస్ మొదట తన తల్లి, భార్య, పిల్లలను చంపి తర్వాత ఆయన ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఇటీవల డాక్టర్ శ్రీనివాస్ ఆర్థికంగా నష్టాలు రావడంతో తన ఆస్పత్రిని అమ్మేసినట్లు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే శ్రీనివాస్ తన కుటుంబాన్ని హతమార్చి తర్వాత ఆయన ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అంచనా వేస్తున్నారు. కాగా, తన కారులో బంగారం అభరణాలు పెట్టి తన సోదరుడు వస్తే కారు తాళం అందించాలని స్థానికుడికి అప్పగించారని తెలుస్తోంది. పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిదిమంది మావోయిస్టుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

స్పెషల్ టాస్క్ ఫోర్స్, డీఆర్‌జీ దళాలు సంయుక్తంగా సోమవారం రాత్రి నుంచే గాలింపు చేపట్టాయి. మంగళవారం ఉదయం మావోయిస్టులు ఉన్న ప్రాంతానికి చేరుకున్నాయి. వీరిని చూసిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. భద్రతా దళాల ఎదురుకాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోగా... మరికొందరు తప్పించుకున్నారు. ఈ కాల్పుల్లో భద్రతా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ఘటనాస్థలం నుంచి ఏకే-47 రైఫిల్, పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో కాంకేర్, నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 88 మంది నక్సలైట్లు మరణించారు. ఇటీవల కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడ కాల్పుల్లో 29 మంది మరణించారు. వీరిలో ఉత్తర బస్తర్ డివిజన్ కమిటీకి చెందిన అగ్ర నాయకులు ఉన్నారు.

ఈసీ నోటీసులివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

అయితే లక్షల కోట్ల రూపాయలను ఎగ్గొట్టి దేశం విడిచి వెళ్లిన 29 మందిలో ముస్లింలు లేరని, మోదీకి చెందిన వారు, ఆయన ప్రాంతానికి చెందిన వారే ఉన్నారన్నారు. ఇండియా కూటమి గెలిస్తే దేశానికి ప్రమాదరమని మోదీ చెప్పడంపై నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతి ఔన్నత్యానికి, సెక్యూలరిజానికి, అంగీకృతవిధానానికి వ్యతిరేకంగా మోదీ, అమిత్ షా మాట్లడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేస్తే మోదీ పతనం మొదలవుతుందని అన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడినవారు, హత్యకేసుల్లో ఉన్నవారు, దోపిడీదారులు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారని, రాజకీయంగా వ్యతిరేకించిన కేజ్రీవాల్, రేవంత్ రెడ్డి దేశ ద్రోహులా అని నిలదీశారు. బీజేపీకి మద్దతిస్తున్న ఏపీ సీఎం పదేళ్లుగా బెయిల్ బయటే ఉంటారా? అని ప్రశ్నించారు.

ప్రధాని మోదీ కక్షపూరితంగా వ్యవహరిస్తూ దిగజారి ప్రవర్తిసున్నారని నారాయణ విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత దిగజారిన ప్రధాని మరొకరు లేరన్నారు. మోదీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఉండబోదని, హిట్లర్ పాలన రావాల్సిందే తప్ప మరో మార్గం లేదన్నారు. బీజేపీ ఓటమి దిశగా ఉందని గుర్తించిన మోదీ, నిరాశ నిస్పృహలకు గురై ఇలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీకి ఆయా రాష్ట్రాల్లో దానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుకూలంగా ఉన్న రాజకీయ పార్టీ అభ్యర్థులను ఓడించి, ఇండియా కూటమిని గెలిపించాలని నిర్ణయించామని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని పొమ్మనూరులో ఎన్నికలను సజావుగా నిర్వహించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు రాదని అన్నారు. రాష్ట్రంలో ప్రమాదకర బీజేపీ ఎదిగేందుకు బీఆర్ఎస్ కారణమని మండిపడ్డారు. ప్రస్తుతం కేంద్రంలో హంగ్ ప్రభుత్వం వస్తుందని, తమకు 12 సీట్లు రావాలని కేసీఆర్ చెబుతున్నారని, మోదీకి 200 సీట్లు వచ్చే పరిస్థితి లేదంటే, ఇక కేసీఆర్‌కు జీరో వస్తాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అవినీతి, అహంభావంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన కమ్యూనిస్టులను కాదని, మూడు నామాలు పెట్టేవారిని చేరదీశారని, వారే ఇప్పుడు పార్టీని వీడుతున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటగానే ఆ ప్రభుత్వం తొందరగా పడిపోతుందని చెబుతున్నారని, కేరళలో ఒక్క సీటు మెజార్టీతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే అక్కడ ఎల్‌డిఎఫ్ (వామపక్ష) ఐదేళ్ల ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బందిపెట్టబోమని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు రాజీనామా సవాళ్లు మంచిది కాదన్నారు. ప్రజా సమస్యలపైన పోరాటం చేయాలని నారాయణ హితవు పలికారు.

కత్తి మొనపై ఏపీ భవిష్యత్

- 13 లక్షల కోట్ల అప్పుతో దివాలా
- సైకో పాలన సాగనంపి స్వర్ణాంధ్రకు సహకరించండి
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్ కత్తి మొనపై వేలాడుతోందని, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన తెలుగుజాతి నేడు ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని చూసి తలదించుకుంటోందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాగళం పేరుతో ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లూటీ కోసమే రూ.13 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారని ఆరోపించారు. అయిదేళ్లుగా అన్ని రంగాల్లో రాష్ట్రం తిరోగామి దిశలో పయనిస్తున్నదని, సమాజంలో ఎటుచూసినా అభద్రత, అశాంతి, హత్యలు, ఆత్మహత్యలు కానవస్తున్నాయి. ధరలు, పన్నులు, ఛార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.ఎనిమిది లక్షల భారం మోపారు. రూ.10 ఇచ్చి రూ.100 కొట్టేస్తూ నవమోసాలు చేస్తున్నారు. పట్టభద్రుల నిరుద్యోగంలో 24 శాతంతో దేశంలో ఏపీ మొదటి స్థానంలో ఉండగా, రైతు ఆత్మహత్యల్లో మూడవ, 18 ఏళ్లలోపు బాలికలపై జరుగుతున్న అత్యాచారాలలో రెండో స్థానంలో ఉందన్నారు. ఏపీకి అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టును, నదుల అనుసంధానాన్ని గోదాట్లో ముంచేశాడు. సంపద సృష్టి, ఉపాధికల్పనా కేంద్రమైన ప్రజా రాజధాని అమరావతిని విధ్వంసం చేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులు రూ.లక్ష కోట్లు దారి మళ్లించాడని ధ్వజమెత్తారు. అన్న క్యాంటీన్లు, నిరుద్యోగభృతి, పండుగ కానుకలు వంటి వందకు పైగా తెలుగుదేశం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశాడు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో లక్షలాది ఎకరాల ప్రజల ఆస్తులు కబ్జా చేస్తున్నారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్ర చందనం, రేషన్ బియ్యం మాఫియాలతో రూ.ఎనిమిది లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 10 శాతం కోతకోసి 16,800 రాజ్యాంగబద్ధ పదవులకు దూరం చేశారు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మంది ఆరోగ్యాలు నాశనం చేశారు. 30 వేల మంది ప్రాణాలు తీసి వారి భార్యల మాంగల్యాలు మంటగలిపారు. గృహనిర్మాణం పేరుతో పేదలను అప్పులపాలు చేశారు. ప్రశ్నించిన ప్రతిపక్షాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 600 మందిని హత్య చేశారు. బాబాయి వివేకానందరెడ్డి హంతకులను కాపాడుతున్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన రూ.12 వేల కోట్లు దారిమళ్లించి గ్రామ, పట్టణాభివృద్ధిని దెబ్బతీశారు. ఈ విధ్వంస పరిస్థితులను చక్కదిద్ది రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఈ ఎన్నికల రూపంలో ఒక్క అవకాశం మన ముందుకు వచ్చింది. సైకో పాలనను సాగనంపి స్వర్ణాంధ్రను నిర్మించుకోవడానికి ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఘన విజయం చేకూర్చాల్సిన అవసరం ప్రతి ఓటరుపై ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం 'సూపర్ సిక్స్' పేరుతో ఆరు హామీలను మీముందు వుంచాం. జనసేన పార్టీ ప్రతిపాదించిన 'షణ్ముఖ వ్యూహం' అంశాలను పొందుపరిచాం.

వాటిని మీరందరూ ఆమోదించడం మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఈ మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాలన్నింటినీ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి అవసరమైన నిధులను సాధించి రాష్ట్ర పునర్నిర్మాణానికి కృషి చేస్తామని, ప్రజలు ఆశీర్వదించాలని చంద్రబాబు, పవన్ విజ్ఞప్తి చేశారు.

కలవరం!

(మొదటిపేజీ తరువాయి)

వేసింది. ఎన్డీఏ కూటమిలో గాజుగ్లాసు కుంపటి పెట్టినట్లయింది. ఈ గాజుగ్లాసు గుర్తు జనసేనకే పరిమితం కాకుండా, స్వతంత్రులకు కేటాయించడంతో ఎన్డీఏ కూటమి నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. దీని ప్రభావం టీడీపీ, బీజేపీపై పూర్తిగా పడనుంది. ఎన్డీఏ తరపున ప్రధాన అభ్యర్థులు పోటీ చేస్తున్న చోటా స్వతంత్రులకు గాజుగ్లాసు ఇచ్చారు. తిరుగుబాటు అభ్యర్థులూ గాజుగ్లాసుతో బరిలో ఉన్నారు. అసెంబ్లీలతోపాటు పార్లమెంట్ ఎన్నికల్లోను గాజుగ్లాసును స్వతంత్రులు చేజిక్కించుకున్నారు.

ఏపీలో మొత్తం 52 అసెంబ్లీ, ఆరు లోక్‌సభ స్థానాల్లో ఫ్రీ సింబల్ జాబితాలో స్వతంత్ర, రెబల్ అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులకు గాజుగ్లాసును అధికారులు కేటాయించారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో పెద్దఎత్తున గాజుగ్లాసు స్వతంత్ర అభ్యర్థులు ఎంచుకున్నారు. ఒంగోలు, అనకాపల్లి, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, బాపట్ల లోక్‌సభ స్థానాల స్వతంత్ర అభ్యర్థులకు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల్లో రెండు అసెంబ్లీలకు పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులకు, విజయనగరం జిల్లాల్లో ఇద్దరు స్వతంత్ర అసెంబ్లీ అభ్యర్థులకు గాజుగ్లాసు కేటాయించారు. విశాఖలో ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థులకు, ఒక ఎంపీ అభ్యర్థికి గాజుగ్లాసు దక్కింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 10 అసెంబ్లీ స్థానాలకు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు అసెంబ్లీలకు, ఒక లోక్‌సభకు గాజుగ్లాసు గుర్తు లభించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో ఏడు అసెంబ్లీలకు, ఒక లోక్‌సభకు గాజుగ్లాసును స్వతంత్రులకు దక్కింది. గుంటూరు జిల్లాలో ఐదు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి గాజుగ్లాసు గుర్తు లభించింది. ప్రకాశం జిల్లాల్లో మూడు అసెంబ్లీలకు, ఒక లోక్‌సభకు, నెల్లూరు జిల్లాల్లో మూడు అసెంబ్లీ అభ్యర్థులకు, కడపలో పోటీలో ఉన్న ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థులకు, ఎంపీ అభ్యర్థికి గాజుగ్లాసు దక్కింది. కర్నూలు జిల్లాల్లో నలుగురు అసెంబ్లీ అభ్యర్థులకు, చిత్తూరులో నాలుగు అసెంబ్లీ అభ్యర్థులకు ఈ గుర్తు ఇచ్చారు. అనంతపురం జిల్లాల్లో మూడు అసెంబ్లీ స్థానాలకు బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థులకు గాజుగ్లాసు దక్కడంలో కూటమి అభ్యర్థులు కలవరం పడుతున్నారు.

టీడీపీ అధినేత చంద్రబాబు పోటీ చేస్తున్న కుప్పంలోను గాజుగ్లాసుతో మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా దిగారు. గుంటూరుజిల్లా మంగళగిరి టీడీపీ అభ్యర్థిగా నారా లోకేశ్ పోటీచేస్తున్న చోటా గాజుగ్లాసు గుర్తును మరొకరికి కేటాయించారు. శ్రీకాకుళంజిల్లా టెక్కలిలోని అచ్చెన్నాయుడు పోటీచేస్తున్న నియోజకవర్గంలో గాజుగ్లాసుతో ఒకరు బరిలోకి దిగారు. భీమిలిలో గంటా శ్రీనివాసరావు పోటీచేసే చోటా గాజుగ్లాసు గుర్తుతో మరొకరు పోటీ చేస్తున్నారు. విజయనగరం అసెంబ్లీ టీడీపీ రెబల్ మీసాల గీతకు గాజుగ్లాసు గుర్తు, జగ్గంపేటలో జనసేన రెబల్‌గా పోటీ చేస్తున్న సూర్యచంద్రకు గాజుగ్లాసు గుర్తు వెళ్లిపోయింది. ఒంగోలు, అనకాపల్లి, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, బాపట్ల లోక్‌సభ స్థానాల్లో గాజుగ్లాసు గుర్తు ఇచ్చేశారు. పెదకూరపాడులో వైసీపీ ఎమ్మెల్యే శంకరరావు కుమారుడు డమ్మీగా నామినేషన్ వేయగా, ఆయనకూ గాజుగ్లాసు గుర్తు కేటాయించారు. చంద్రగిరి, తాడిపర్తి, రాప్తాడు, గుంతకల్లు నియోజకవర్గాలోను గాజుగ్లాసు ఇతరులకు దరిచేరింది. ఆదోని, ప్రత్తికొండ అసెంబ్లీల్లో గాజుగ్లాసును స్వతంత్రులు తీసుకున్నారు. విశాఖపట్నం తూర్పు, విజయవాడ సెంట్రల్, మైలవరం, జగ్గయ్యపేట, గన్నవరం, మచిలీపట్నం, పాలకొల్లు, తణుకు, మండపేట, రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గాలో గాజుగ్లాసు గుర్తును పోటాపోటీగా తీసుకున్నారు. కడపజిల్లా కమలాపురం, మైదుకూరు, రాజంపేటలో కూడా గాజుగ్లాసు గుర్తును స్వతంత్రులకు ఇచ్చారు. కావలి, అద్దంకి, పర్చూరు, చీరాల, మదనపల్లి, ఆముదాలవలస తదితర అసెంబ్లీ నియోజకవర్గాల్లో గాజుగ్లాసు గుర్తును స్వతంత్రులకు వెళ్లిపోయింది. ఇప్పటికే గాజుగ్లాసు గుర్తు పొందిన స్వతంత్ర అభ్యర్థులంతా ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ పరిణామాలు తమ గెలుపు అవకాశాలను దెబ్బతీస్తుందని ఎన్డీఏ కూటమి పార్టీల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నేడు ఎన్నికల సంఘం హైకోర్టుకు సమర్పించే నివేదిక ఆధారంగా గాజుగ్లాసు గుర్తుపై ఉత్కంఠకు తెరపడనుంది.

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

నొక్కి రూ.100 ఇచ్చి రూ.1000 లాగడం జగన్ చాకచక్యానికి నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల అయిందని, మొదటి ఐదేళ్ల చంద్రబాబు ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదని, తర్వాత వచ్చిన జగన్ సైతం ప్రత్యేక హోదా ఊసే ఎత్తలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, డ్రగ్స్ మాఫియా ఏర్పడిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో లక్షల మంది పేదలకు ఇళ్లు, ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలు అందించారని, ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. అమలాపురం పార్లమెంటు అభ్యర్థిగా జంగా గౌతమ్, పి.గన్నవరం శాసనసభ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఇస్మాయిల్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ, సీపీఐ, సీపీఎం నాయకులు సత్తిబాబు, వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నేతల నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ, కాంగ్రెస్ అభ్యర్థులు అయితాబత్తుల సుభాషిని, పాలెపు ధర్మారావు, సరెల్ల ప్రసన్నకుమార్, కోట శ్రీనివాసరావు, రౌతు ఈశ్వరరావు, నాయకులు నాగవరపు నాగరాజు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిటన్ భారతీయుల్లో
మోదీపై వ్యతిరేకత

న్యూఢిల్లీ: బ్రిటన్‌లో నివసిస్తున్న భారతీయుల్లో 52శాతం మందికి ప్రధాని నరేంద్రమోదీపై వ్యతిరేకత ఉన్నట్లు ఓ సర్వే వెల్లడించింది. సర్వేలో పాల్గొన్న వారిలో యాభై శాతం మంది హిందువులు హిందుత్వ సూత్రాలను తిరస్కరించారు. సర్వేలో పాల్గొన్న 500 మంది వ్యక్తులు తమను తాము బ్రిటిష్ భారతీయులుగా గుర్తించుకున్నారు. నిజమైన ప్రజాస్వామ్య భారతదేశాన్ని రక్షించడానికి ప్రయత్నించే సమాజం నేతృత్వంలోని సంస్థగా చెప్పుకుంటున్న 'ప్లాట్‌ఫాం ఫర్ ఇండియన్ డెమోక్రసీ' ఈ సర్వే నిర్వహించింది. సర్వేలో పాల్గొన్నవారిలో పురుషులు, మహిళలు సమానంగా ఉన్నారు. ఇందులో 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు (57%), హిందువులు (43%), డిగ్రీ ఉన్నవారు (62%), బ్రిటన్ వెలుపల జన్మించిన వారు 56% ఉన్నారు. సర్వేలో 35 శాతం మంది మోదీ పట్ల సానుకూల అభిప్రాయం వ్యక్తం చేయగా... 52% మంది ప్రతికూల అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. హిందువులలో 57% మంది భారత ప్రధానిని సమర్థించగా... హిందూయేతరుల్లో 71% మోదీని వ్యతిరేకించారు. 'ముఖ్యంగా బ్రిటన్‌లో కాకుండా భారతదేశంలో జన్మించిన వారు, వృద్ధులు, ఇంగ్లీషు మాట్లాడని ఇంట్లో ఉన్నవారు మోదీ పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉన్నారు' 'ప్లాట్‌ఫాం ఫర్ ఇండియన్ డెమోక్రసీ' ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. పురుషుల (28%) కంటే ఎక్కువ మంది మహిళలు (34%) మోదీ పట్ల ప్రతికూల అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని పేర్కొంది. భారతదేశ గమనం గురించి అడిగినప్పుడు... హిందువుల్లో 68% మంది భారతదేశం సరైన మార్గంలో ఉందని నమ్ముతున్నారని, అయితే 73% మంది హిందువులు కానివారు మరియు 81% మంది ముస్లింలు అంగీకరించలేదని వేదిక తెలిపింది. సర్వే సారాంశాన్ని గమనించినట్లయితే అత్యధికులు మోదీ ప్రోత్సహించిన మతపరమైన హింసను ప్రస్తావించారు. అది యూకేకి వ్యాపించడం ఒక ప్రధాన ఆందోళనగా పేర్కొన్నారు. సగానికి పైగా హిందూ ప్రతివాదులు (65%) సంబంధిత సంఘటనలకు మోదీని బాధ్యులుగా భావించారు. ప్రతివాదులలో అరవై ఐదు శాతం మంది దీనిని 1 నుండి 10 స్కేల్‌లో... 8 నుండి 10 వరకు రేట్ చేశారు. (10 చాలా తీవ్రమైన ఆందోళనలను సూచిస్తుంది). ఈ సర్వే భారత్‌లో ప్రస్తుత నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ విధానాలకు బ్రిటన్‌లోని మొత్తం భారత సమాజం మద్దతు ఇస్తుందన్న వాదనను సవాల్ చేస్తోంది. సమాజంలోని విభిన్న అభిప్రాయాలను బహిర్గతం చేసిందని వేదిక పేర్కొంది.

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ దినేశ్ బాధ్యతలు

న్యూఢిల్లీ : భారత నావికాదళం 26వ చీఫ్‌గా అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నేవీ చీఫ్‌గా 40 ఏళ్లకు పైగా సేవలందించిన అడ్మిరల్ ఆర్.హరికుమార్ పదవీవిరమణ చేసిన సంగతి తెలిసిందే. సముద్ర ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, ప్రతికూలతలను శాంతియుతంగా అరికట్టడానికి, కానిపక్షంలో యుద్ధాన్ని గెలవడానికి అవసరమైన కార్యాచరణతో నావికాదళం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆత్మనిర్భర భారత్ దిశగా భారత నావికాదళం చేస్తున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తానని, వికసిత్ భారత్ ద్వారా నూతన సాంకేతికతలు, వికసిత్ భారత్ కోసం నూతన అన్వేషణలతో నేవీని దేశ అభివృద్ధిలో మూలస్తంభంగా మార్చేలా చేస్తానని అన్నారు. నేవీలో మానవ వనరులను అంటే పురుషులు, మహిళల నైపుణ్యాలు పెంచేందుకు, వారికి అత్యుత్తమ ఆయుధాలు అందించేందుకు, శిక్షణ, వృత్తిపరమైన వాతావరణం, పరిపాలనాపరమైన మద్దతు అందించడానికి తాను ప్రాధాన్యతనిస్తానని అన్నారు.

నేడు అయోధ్యకు రాష్ట్రపతి

న్యూఢిల్లీ : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం అయోధ్య పర్యటనకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆమె అయోధ్య రాముడిని దర్శించుకుంటారు. హనుమాన్ గర్హి ఆలయంలో హనుమంతుడిని దర్శించుకుని హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత సరయూ పూజ, హారతి కార్యక్రమం నిర్వహించనున్నారు. అయోధ్యలో రాష్ట్రపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు మినహా మిగతా సమయంలో సాధారణ భక్తులకు ఎలాంటి ఆటంకం ఉండదని ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటికే దర్శనానికి టికెట్‌లు బుక్ చేసుకున్న భక్తులు తమకు కేటాయించిన సమయంలోనే దర్శనం చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రపతి ముర్ము బుధవారం సాయంత్రం 4 గంటలకు అయోధ్యకు చేరుకుంటారు.

చంద్రబాబు హామీలు బూటకం

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకోండి అంటూ పదే పదే చెప్తూ... మూడు సభల్లోనూ తన ప్రసంగాన్ని కొనసాగించారు సీఎం. మొదటి ఐదేళ్లలో గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేశామన్న జగన్... వచ్చే ఐదేళ్లలోనూ సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా అందిస్తామన్నారు. ఇంటి దగ్గరకే వెళ్లి పెన్షన్ అందించాలన్న ఆలోచన చంద్రబాబు ఎప్పుడైన చేశారా అని కలికిరి సభలో ప్రశ్నించారు. అంతకుముందు ప్రకాశం జిల్లా టంగుటూరు సభలో మాట్లాడిన సీఎం జగన్.. చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలకు ముగింపేనన్నారు. ఆయన అధికారంలోకి వస్తే చంద్రముఖి నిద్రలేస్తుందన్నారు. చంద్రబాబు హయాంలో 32 వేల ఉద్యోగాలు ఇస్తే తామొచ్చాక 2 లక్షల 31 వేల ఉద్యోగాలిచ్చామన్నారు. చంద్రబాబు 2014లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలుచేశారా ప్రశ్నించిన సీఎం... తాము చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందే కనిపిస్తుందన్నారు. చంద్రబాబు హయాంలో వెయ్యి రూపాయల పెన్షన్ ఇస్తే.. తామొచ్చాక దాన్ని మూడు వేల రూపాయలకు పెంచామన్నారు. చంద్రబాబు ఫిర్యాదుతోనే పెన్షన్ పంపిణీలో ఇబ్బందులొచ్చాయని జగన్ ఆరోపించారు. మైదుకూరు సభలో మాట్లాడుతూ... లంచాలు, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని... ఈ తరహాలో ప్రభుత్వ పథకాలు ఎప్పుడైనా అమలుచేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబు పేరు చెప్తే ఒక్క సంక్షేమ పథకమైన గుర్తుకువస్తుందా అని ప్రశ్నించారు. నాలుగేళ్ల పాటు వర్షాలు పుష్కలంగా కురిసిన కారణంగా రాజోలు ప్రాజెక్ట్ ప్రాధాన్యత తెలియలేదన్నారు. అయితే వచ్చే టర్మ్‌లో రాజోలు ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని మైదుకూరు సభలో హామీ ఇచ్చారు. చంద్రబాబు మరోసారి బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు మీ ముందుకొస్తున్నాడని...నమ్మి ఓటేస్తే రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి పోతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైసీపీని ఆదరించాలని కోరారు. 2024లో ఎన్నికల సంగ్రామంలో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పాల్గొనాలని కోరారు. 'మా పొత్తు మీతోనే ఉంది... మీకు ఈ ఐదేళ్లలో లబ్ధి చేకూరితేనే ఓటు వేయండి లేకపోతే వద్దని నేను బలంగా చెప్తున్నా' అని జగన్ అన్నారు. వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో చేసేదే పెట్టామని... సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేయడం తనకు చేతకాదని అన్నారు. చంద్రబాబును నమ్మడం అంటే కొండ చిలువ నోట్లో తల పెట్టినట్లేనని అన్నారు. కొండేపి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆదరించాలని కోరారు.

ఎన్నికల ముందే కేజ్రీవాల్ అరెస్టు ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం విచారణ కొనసాగించింది. వ్యక్తి స్వేచ్ఛ అనేది చాలా కీలకమైనదని దీన్ని మీరు నిరాకరించలేరని ఈడీని ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సమయంపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొంది. విచారణ చేపట్టడం, ఆపై అనేక ఫిర్యాదులు పునరావృతం కావడం మధ్య ఎందుకు విరామం ఉందనే వివరాలపైనా స్పందించాలని దర్యాప్తు సంస్థను సుప్రీంకోర్టు కోరింది. లోక్‌సభ ఎన్నికలకు కొద్ది ముందు ఎందుకు తన క్లయింట్‌ను అరెస్టు చేయాల్సి వచ్చిందో చెప్పాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తన వాదనల సందర్భంగా ప్రశ్నించారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ... "స్వేచ్ఛ అనేది చాలా ముఖ్యమైన అంశం' అని స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన అరెస్టుపై కేజ్రీవాల్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఈడీ తరపు న్యాయవాదిని జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశించారు. వచ్చే శుక్రవారం మధ్యాహ్నం లోగా స్పందన తెలియజేయాలని ఈడీకి గడువు విధించారు. బుధవారం నుంచి ఈ ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ధర్మాసనాల్లో విచారణ చేపట్టాల్సి ఉండటంతో కేజ్రీవాల్ బెయిల్‌పై తదుపరి విచారణ శుక్రవారం జరిగే అవకాశాలున్నాయి. కాగా... ఈ నెల ప్రారంభంలో కేజ్రీవాల్ అరెస్టును దిల్లీ హైకోర్టు సమర్థించింది. దర్యాప్తునకు ఆయన సహకరించనందువల్లే అరెస్టు చేయడం మినహా ఈడీకి మరో గత్యంతరం లేకపోయిందని కోర్టు అభిప్రాయపడింది. లోక్‌సభకు ఎన్నికలకు ముందు మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసిన సంగతి విదితమే.

సిసోడియాకు మళ్లీ నిరాశ

దిల్లీ మద్యం కేసులో అరెస్టయ్యి జైలులో ఉన్న దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు కోర్టులో మళ్లీ నిరాశ ఎదురైంది. సిసోడియాకు బెయిల్ ఇచ్చేందుకు కేసు విచారిస్తున్న రౌస్ ఎవెన్యూ కోర్టు నిరాకరించింది. సిసోడియాకు బెయిల్ ఇవ్వకూడదని సీబీఐ, ఈడీ కోర్టులో వాదనలు వినిపించాయి. దీంతో కోర్టు సిసోడియాకు బెయిల్ నిరాకరించింది. కాగా ఈ కేసులో సిసోడియాను సీబీఐ గతేడాది ఫిబ్రవరి26న అరెస్టు చేసింది. అప్పటి నుంచి సిసోడియా జైలులోనే ఉంటున్నారు. సీబీఐతో పాటు ఈడీ పెట్టిన కేసుల్లో సిసోడియా రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేయడం ఇది రెండవసారి. గతేడాది సిసోడియా వేసిన బెయిల్ పిటిషన్లను ట్రయల్‌కోర్టుతో పాటు హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టేసిన సంగతి విదితమే.

సంక్షేమం... సమగ్రాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్ (పి4) పథకాలు అమలు, రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సెన్సెస్ చేపట్టి తద్వారా ప్రజల నైపుణ్యత స్థాయిని పెంపు చేయడం, సౌభాగ్య పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు సబ్సిడీ, ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాన్ని కొనసాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి చేపట్టనున్నారు.

మెగా డీఎస్సీ, ఏటా జాబ్‌క్యాలెండర్

యువతకు అత్యధిక ప్రాధాన్యతినిస్తూ మేనిఫెస్టోలో వరాలు కురిపించారు. మెగా డీయస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్‌లు, అత్యధిక ఉద్యోగ కల్పన చేసే ఎంఎస్‌ఎంఈ రంగానికి ప్రోత్సాహకాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి చెల్లించనున్నారు.

వృద్ధులకు ఏప్రిల్ నుంచే రూ.4 వేలు

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు చేశారు. ఇవి ఏప్రిల్ 2024 నుంచి అమలు చేయనున్నారు. దివ్యాంగులకు రూ.6,000, పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ.15 వేలు, కిడ్నీ, తలసీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వనున్నారు.

బీసీ సంక్షేమానికి పెద్దపీట

బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టాలని, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు, చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం, తక్కువ జనాభాతో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు నామినేటెడ్ పదవుల ద్వారా రాజకీయ భాగస్వామ్యం కల్పించడం, దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధుల కేటాయింపు, స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు, రూ.5,000 కోట్లతో 'ఆదరణ' పథకం పునరుద్ధరణ, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, 50 సంవత్సరాలకే నెలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వనున్నారు.

మరిన్ని సంక్షేమ పథకాలు

స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంపు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం అమలు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్లూమ్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం, దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.25 వేలు గౌరవ వేతనం, షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయింపు, వడ్డెర క్వారీల్లో 15 శాతం రిజర్వేషన్, సముద్రంలో వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థిక సాయం, గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం మంజూరు, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, నివాస స్థలాల మంజూరు, వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేలకు పెంపు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 1వ తేదీన జీతాల చెల్లింపు, పీఆర్సీ అమలు, సీపీఎస్‌ను సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం, ప్రజా రాజధాని అమరావతిలో అల్లూరి సీతారామరాజు స్మృతివనం నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయింపు, ఎస్సీ, ఎస్టీలకు, ముస్లిం, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్, ఇమామ్, మౌజన్‌లకు ప్రతినెలా రూ.10 వేలు, హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో ముస్లింకు రూ.1 లక్ష సాయం, క్రిస్టియన్ మిషనరీ ఆస్తుల అభివృద్ధి బోర్డు ఏర్పాటు, జెరూసలెం యాత్రికులకు సాయం, వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా, పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి, చెత్త పన్ను రద్దు, పెట్రోలు, డీజిల్, మద్యం ధరల నియంత్రణ, అన్ని మండల కేంద్రాలలో జన ఔషధి కేంద్రాలు, అన్న క్యాంటిన్లు, ఉచిత ఇసుక విధానం, మూతపడిన పాఠశాలల పున: ప్రారంభం, అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు చెల్లింపు, అర్చకులకు కనీస వేతనం రూ.15 వేలకు పెంపు, సీమను హార్టికల్చర్ కేంద్రంగా అభివృద్ధి, సర్పంచ్‌ల నుంచి జెడ్పీ చైర్మన్‌ల వరకు గౌరవ వేతనం పెంపు, జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వ స్టయిఫండ్ నెలకు రూ.10 వేలకు పెంపుతో పాటు అన్ని వర్గాలకు సంబంధించి వివిధ రకాల సంక్షేమ పథకాలను ఈ మేనిఫెస్టోలో పొందుపరిచారు.

దెందులూరు కాంగ్రెస్ అభ్యర్థిపై
వైసీపీ మూకల దాడి

- ప్రచార రథం ధ్వంసం
- మహిళా కార్యకర్తలకు గాయాలు
- ప్రభుత్వాసుపత్రిలో బాధితులకు నాయకుల పరామర్శ
- ఇండియా కూటమి నేతల ఖండన

విశాలాంధ్ర-ఏలూరు క్రైం: దెందులూరులో మరోసారి రాజకీయ వివాదం రాజుకుంది. ఈసారి కాంగ్రెస్ పార్టీ వంతైంది. సరిగ్గా మూడు రోజుల క్రితం పెదవేగి మండలంలో చింతమనేని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని గ్రామస్థులపై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఆ ఘటన మరువకముందే సోమవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి, అతడి అనుచరులు, మహిళా కార్యకర్తలపై దెందులూరు మండలం గంగన్నగూడెం వద్ద వైసీపీ మూకలు మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో ఆలపాటి వాహనం, ప్రచార రథం ధ్వంసం అయ్యాయి. మహిళా కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇండియా కూటమి తరపున సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, అమ్ ఆద్మీ, భారత బచావో పార్టీల నాయకులు మంగళవారం పరామర్శించారు. వైద్యులను సంప్రదించి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

అబ్బయ్య చౌదరిపై అట్రాసిటీ కేసు: దేగా ప్రభాకర్ డిమాండ్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ దెందులూరు కాంగ్రెస్ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి అతడి అనుచరులపై దాడిని ఖండిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి... దళితులను కులం పేరుతో దూషించడం అమానుషం అని, ఎన్నికల వాహనాలపై దాడులకు పాల్పడటం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం అని అన్నారు. అబ్బయ్య చౌదరిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమి తరపున కలెక్టర్, ఎస్పీ, రిటర్నింగ్ అధికారులను కలసి బాధితులకు న్యాయం చేయాలని కోరతామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అరటికట్ల రవి మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో వైసీపీ మూకలు దాడికి తెగబడటం దారుణం అన్నారు. అడ్డొచ్చిన సీపీఐ, సీపీఎం కార్యకర్తలను దుర్భాషలాడటం తగదన్నారు. ఘటన జరిగి 12 గంటలు కావస్తున్నా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. అబ్బయ్య చౌదరి, అతడి అనుచరులపై ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు కేసు నమోదు చేయాలన్నారు. కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామమోహనరావు మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పర్యటన విజయవంతం కావడంతో జీర్ణించుకోలేని వైసీపీ అభ్యర్థి దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఘటనను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. వైసీపీ అభ్యర్థి పై అనర్హత వేటువేయాలని ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆలపాటి మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే దాడులకు పాల్పడటం దుర్మార్గం అన్నారు. ఇకనైనా అబ్బయ్య చౌదరి దుందుడుకు వైఖరిని మానుకోవాలని హితవు పలికారు. బాధితురాలు స్వరూపరాణి మాట్లాడుతూ మహిళలని చూడకుండా దుర్భాషలాడి, భౌతిక దాడులకు పాల్పడ్డారని కన్నీటి పర్యంతం అయ్యారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, సీపీఐ నేత గేదెల నాగేశ్వరరావు బాధితులను పరామర్శించారు.

ఇళ్ల వద్దే పింఛన్ ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, చేనేత, మత్స్య తదితర పెన్షన్‌దారులకు మే నెలలో సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే పింఛను పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళ వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే నెల పెన్షన్ల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారులను ఇబ్బంది పెట్టేలా మరో మెలిక పెడుతోంది. బ్యాంకుల్లో పెన్షన్ మొత్తాన్ని జమ చేస్తామని పెన్షన్‌దారులు సచివాలయాల వద్ద సమాచారం తెలుసుకుని, ఆయా బ్యాంకులకు వెళ్లి పెన్షన్ సొమ్ము తీసుకోవాలని చెప్పడం దుర్మార్గం. వృద్ధులను ఇబ్బంది పెట్టి తద్వారా ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పన్నిన పన్నాగంగా కనిపిస్తోంది. అందుకు కొందరు ప్రభుత్వ అధికారులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. వృద్ధుల ప్రాణాలతో చెలగాటమాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,25,000 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారి ద్వారా రాష్ట్రంలో ఉన్న 66 లక్షల మంది పెన్షన్‌దారులకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే మే 1న పెన్షన్లు పంపిణీ చేయవచ్చు. రాష్ట్రంలో ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా వృద్ధుల వడగాపులను, ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గమనించి, తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నాం. వృద్ధుల పట్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చిత్తశుద్ధి ఉంటే గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందిని వినియోగించి మే 1న ఇళ్ల వద్దనే పెన్షన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఎన్‌డీఏ మేనిఫెస్టోలో అభివృద్ధి జాడ ఏది?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ, టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో అభివృద్ధి జాడ ఏదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు సూటిగా ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఎన్‌డీఏ ఉమ్మడి మేనిఫెస్టోలో విభజన హామీలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, పోలవరం నిర్వాసితుల ప్రస్తావనే చేయకపోవడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని తెలిపారు. అస్పష్టమైన వాగ్దానాలతో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని, రాష్ట్రాన్ని బీజేపీకి తాకట్టు పెట్టేలా ఉమ్మడి మేనిఫెస్టో ఉందన్నారు. కేజీ టు పీజీ సిలబస్‌ని సమీక్షించడం అంటే... బీజేపీ మతోన్మాద అజెండాకు మద్దతిచ్చి విద్య కాషాయికరణకు అంగీకరించడమేనని తెలిపారు. పౌరసత్వం సవరణ చట్టం (సీఏఏ) పై ప్రస్తావించకపోవడం మైనార్టీలను వంచించడమేనని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దుపై, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై అస్పష్టమైన హామీలు ఇచ్చారని వివరించారు. ఈ ఎన్నికల ప్రణాళిక పట్ల బీజేపీ సానుకూలంగా ఉందని టీడీపీ, జనసేన నాయకులు చెప్పారే తప్ప, బీజేపీ నాయకులు ఎలాంటి ప్రకటన చేయలేదని, ఇది అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నదని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించే భరోసా ఇవ్వలేదని, విద్యుత్ చార్జీలు, నియంత్రిస్తామని, చెత్త పన్ను, ఇంటి పన్నులను సమీక్షిస్తామని, పెట్రోలు, డీజిల్ ధరలు నియంత్రిస్తామని ప్రకటించారేగానీ, పన్నుల భారం వేయమని ప్రకటించలేదన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషను సమీక్షిస్తామని, ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న బీజేపీ ప్రకటనలపై టీడీపీ, జనసేన తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

'ఎన్నికల భారతం'

కవితా సంకలనం ఆవిష్కరణ నేడు

విశాలాంధ్ర-గుంటూరు: కార్మిక దినోత్సవం సందర్భంగా మే ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, కర్నూలు, కడప, అనంతపురం, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, రాజమండ్రి, అమలాపురం, విశాఖ, విజయనగరం, పార్వతీపురం, తెలంగాణలోని హైదరాబాద్ తదితర 15 ప్రాంతాల్లో అరసం శాఖలు కవితా గోష్ఠులను నిర్వహిస్తున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఎన్నికల భారతం' (నేటి ఎన్నికల తీరుతెన్నులపై కవితా సంకలనం) పుస్తకావిష్కరణ చేయనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే బుధవారం సాయంత్రం గుంటూరు బృందావన్ గార్డెన్స్ ఐదో లైన్ సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయ ఆవరణలో అరసం గుంటూరు జిల్లాశాఖ కవితాగోష్ఠిని నిర్వహించి 'ఎన్నికల భారతం' కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తుందని తెలియజేశారు. సభకు అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. సంకలనానికి వల్లూరు శివప్రసాద్, కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ సంపాదకత్వం వహించారు.

శ్రీశ్రీ కవిత్వం స్ఫూర్తిమంతం

జయంతి సభలో చలసాని రామారావు

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: శ్రీశ్రీ ఓ స్ఫూర్తిదాయకమని, ఆయన కవిత్వం అందరినీ కదిలిస్తోందని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలసాని రామారావు అన్నారు. శ్రీశ్రీ 114వ జయంతి అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో అమర్‌భవన్‌లో మంగళవారం జరిగింది. ఆయన కవిత్వం యుద్ధ సంగీతమై నిప్పులు కక్కుతుందన్నారు. 'పదండి ముందుకు పదండి తోసుకు' అంటూ నెత్తురుమండే శక్తులకు నూతనోత్తేజాన్ని అందించే మార్చింగ్ గీతాలాపకుడు శ్రీశ్రీ అని శ్లాఘించారు. కవిత్వ భాషా సముదాయాన్ని సముద్రఘోషలా శబ్దించి విస్తరించినవాడు శ్రీశ్రీ అని పేర్కొన్నారు. ఆయన కవితా ప్రభావం ప్రజల నవనాడుల్లోకి పాకిందని కొనియాడారు. అభ్యుదయ సాహిత్యోద్యమానికి కంచు కాగడాలా కాంతిని విరజిమ్మిందని, ప్రజా ఉద్యమాలకు ఊపు, ఉత్సాహాన్నిచ్చిందని రామారావు గుర్తుచేశారు. ఆకలి, వేదన, పీడన, హాహాకారాలు మరింత పెరుగుతున్న నేటి తరుణంలో ఆయన కవిత్వం మనతో పయనిస్తూనే ఉంటుందని, తన జయంతి, వర్థంతి సందర్భంగా మనల్ని మనం పునర్మూల్యీకరించుకొంటూ ప్రజల పక్షాన పునరంకితమవ్వాలని చలసాని రామారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామసూరి, త్రివిధ స్కూల్ శ్రీనివాసరావు, అరసం జిల్లా కార్యదర్శి శిఖా ఆకాశ్, అరసం నాయకులు దారా మోహన్‌రావు, శేషయ్య, చలసాని వీరభద్రరావు, ఒగ్గు ముఖర్జీ, ఏఐటీయూసీ నాయకులు చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మేడే జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పెద్దఎత్తున జెండాలు ఎగరవేయడం, సభలు, సమావేశాల నిర్వహించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మేడేను ఘనంగా నిర్వహించాలని కార్మికవర్గాన్ని కోరారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేటు అనుకూల విధానాలను రైతులు, కార్మికులు కలసికట్టుగా వ్యతిరేకిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక చట్టాలను కాలరాసి, యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారన్నారు. మూడు దుష్ట సాగు చట్టాలను తెచ్చి రైతుల వెన్ను విరిచారని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా 12 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతుసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాయని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేంత వరకు ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు. కార్మికులు, రైతులు, ప్రజలు సంయుక్తంగా పార్లమెంట్, అసెంబ్లీలో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరారు. బీజేపీని, దానిని బలపరుస్తున్న పార్టీలను ఓడించి ఇండియా కూటమి, వామపక్ష పార్టీలను గెలిపించేందుకు కార్మికవర్గం ప్రతినబూనాలని విజ్ఞప్తి చేశారు.

జూన్ 8న ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు దృష్ట్యా జనవరి 2025కి ప్రారంభమయ్యే రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)-డెహ్రాడూన్ ప్రవేశ పరీక్షను జూన్ ఎనిమిదో తేదీకి మార్చినట్లు సెక్రటరీ జే ప్రదీప్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత జూన్ ఒకటో తేదీన పరీక్ష షెడ్యూలు జారీజేనప్పటికీ, ఎనిమిది రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేసినట్లు వివరించారు. ఆయా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులంతా మారిన షెడ్యూలును గమనించాలని కోరారు.

18 నుంచి ఏపీఈఏపీసెట్

రాష్ట్రంలోని ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్-2024 పరీక్షలు మే 18 నుంచి 23 వరకు జరుగుతాయి. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. దరఖాస్తుల గడువు ముగియడంతో రూ.1,000 అపరాధ రుసుంతో మే ఐదో తేదీ వరకు అవకాశం కల్పించారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు అనుగుణంగా ఏపీఈఏపీసెట్ పరీక్షల షెడ్యూలు జారీజేశారు. పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఏపీఈఏపీసెట్ ర్యాంకింగ్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం, ఏపీఈఏపీసెట్‌కు 75శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు. ఈ మొత్తం పరిగణలోకి తీసుకుని విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు.

హజ్‌యాత్ర విజయవంతం చేయాలి: హర్షవర్ధన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హజ్ యాత్రను విజయవంతం చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యాత్ర సఫలం చేయటంలో భాగంగా ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ అధ్వర్యంలో మొదటి సన్నద్ధత సమావేశం విజయవాడ వించ్‌పేటలోని సాజాహిర్ ముషాఫిర్ ఖానాలో మంగళవారం నిర్వహించారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ ఏడాది కోటా 2,902 మందికి గాను ఇప్పటి వరకు 2,580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 728 మంది, హైదరాబాద్ నుంచి 1,118 మంది, బెంగుళూరు నుంచి 725 మంది, చెన్నయ్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి తొమ్మిది మంది హజ్ యాత్రకు బయలుదేరనున్నారని వివరించారు. యాత్రికులు ఆయా పాయింట్ల నుంచి మే 26 నుంచి జూన్ తొమ్మిది మధ్య బయలు దేరుతారని, సుమారు 42 రోజుల యాత్ర ముగించుకుని జూలై ఒకటి నుంచి 21 లోపు తిరిగి విజయవాడ చేరుకుంటారని తెలిపారు. విజయవాడ యాత్రికుల ప్రయాణానికి స్పైస్‌జెట్ తన సేవలు అందించటానికి ముందుకు వచ్చినట్లు చెప్పారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ సమీపంలోని మదరసాలో వసతి ఏర్పాటు చేయనున్నామని హర్షవర్ధన్ తెలిపారు. ఆర్టీసీ అధికారులు ఏసీ బస్సుల్లో యాత్రికులను మదరసా నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు పంపించే సౌకర్యం కల్పిస్తున్నారని వివరించారు. యాత్రికుల సౌకర్యార్థం 24 గంటలు పనిచేసేలా మదరసా వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి అవసరమైన వారికి వ్యాక్సినేషన్, వైద్య సహాయం అందించాలని వైద్యారోగ్యశాఖాధికారులను ఆదేశించారు. సీఆర్డీఏ అడిషినల్ కమిషనర్ షేక్ హలీంబాషా, ఎయిర్ పోర్ట్ అథారిటీ అధికారి లక్ష్మీకాంత రెడ్డి, హజ్ కమిటీ స్టేట్ సభ్యులు, ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదర్, ఎస్‌బీఐ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.నాగవేణి, డిప్యూటీ జనరల్ మేనేజర్ మనీశ్ కుమార్, ఎయిర్ లైన్స్ అధికారులు, గన్నవరం ఎయిర్ పోర్టు అథారిటీ, కస్టమ్స్, ఆర్టీసీ, పంచాయతీరాజ్, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్ , మున్సిపల్ శాఖ, ఆర్అండ్‌బీ, బీఎస్ఎన్ఎల్, ఫైర్ సర్వీసు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ తొత్తుల్లా అధికారులు

- గాజు గ్లాసు గుర్తు ఎవరికీ కేటాయించకుండా రిజర్వ్ చేయాలి
- ఎన్నికల సంఘం ప్రధాన అధికారికి టీడీపీ నేతల ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలు నశించిపోయాయని, దాడులు, అరాచకాలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనాకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. కొందరు అధికారులు అధికార పార్టీకి తొత్తుల్లా వ్యవహరిస్తున్నారని, చిత్తూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి అరుణ, రాజ్ భవన్ ఆర్మ్ రిజర్వ్‌డ్ డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని కోరారు. గాజు గ్లాసు గుర్తును ఎవరికి కేటాయించకుండా రిజర్వ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను, క్షీణించిన శాంతిభద్రతలు, పుంగనూరు నియోజకవర్గ పరిస్థితులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలియపరిచామన్నారు. రాజ్ భవన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్మ్ రిజర్వ్‌డ్ డీఎస్పీ సుధాకర్, అతని తమ్ముడు పొన్నూరులో అరాచకాలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని కూడా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాం. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అరుణను ఎన్నికల విధులకు దూరంగా పెట్టాలని సీఈవోను కోరినట్లు వర్ల తెలిపారు. ఎన్నికల కమిషన్‌ను కలిసిన వారిలో ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

జైలు వార్డర్ ఆత్మహత్య

విశాలాంధ్ర-అవనిగడ్డ: కృష్ణాజిల్లా అవనిగడ్డ సబ్ జైలులో వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్న దాసరి నాగ శివకుమార్ (37) ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదో వార్డులో తాను నివాసం ఉంటున్న ఇంటిలో సోమవారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న సీఐ త్రినాథ్, ఎస్ఐ రమేశ్ మంగళవారం ఘటనస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం శివకుమార్ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. జైలు వార్డర్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. శివకుమార్ అవివాహితుడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబు, పవన్‌కు ఓటమి భయం: రావెల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్డీఏ కూటమి గెలిచే అవకాశం లేదన్న ఆందోళనతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు ఆరోపించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రజాకోర్టులో వీళ్ల మాట్లాడే ప్రతి మాటకు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. పవన్ కల్యాణ్ జగన్‌కు పొలిటికల్ హాలిడే ఇచ్చేద్దామంటూ అర్థం పర్థం లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని తప్పుబట్టారు. ఎన్నికల తర్వాత పవనే పొలిటికల్ హాలిడే తీసుకోవాల్సి వస్తుందన్నారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు పనికిరాడని, ఆయనో పార్ట్ టైమ్ పొలిటీషియన్ అని ఎద్దేవా చేశారు.

Format C-1

(for candidate to publish in Newspapers, TV)

Declaration about Criminal Cases:

Name and address of Candidate : **LAVU SRIKRISHNA DEVARAYALU S/o Rathaiah, R/o Door No.15-19, Brundavan Gardens, Guntur.522006, Andhra Pradesh State**

Name of Election : **MEMBER OF LOK SABHA (House of the People)**

Name of Constituency : **14–NARASARAOPET Parliamentary Constituency**

I, **LAVUSRIKRISHNA DEVARAYALU** (name of candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

Pending Criminal Cases

Sl. No.	Name of Court	Case No. and Status of case	Sections(s) of Acts concerned and brief description of offence(s)	Name of court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed
1.	NOT APPLICABLE				

Sd/- LAVU SRIKRISHNA DEVARAYALU
14–NARASARAOPET Parliamentary Constituency

Format C-1

(for candidate to publish in Newspapers, TV)

Declaration about Criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme court in WP (Civil) No.536 of 2011 (public interest foundation &Ors. Vs Union of India &Anr.)

Name and address of Candidate : **LAKSHMINARAYANA KANNA**

Name of Political party: **TELUGU DESAM PARTY**

Name of Election: **A.P, ASSEMBLY ELECTION**

Name of the Constituency: **98- SATTENAPALLI, ASSEMBLY CONSTITUENCY**

I, **LAKSHMINARAYANA KANNA** a candidate for the abovementioned election, declare for public information the following details about my Criminal antecedents:

(A) Pending Criminal cases

Sl.No.	Name of the court	Case No and dated	Status of case(s)	Section (s) of Acts concerned and brief description of offence(s)
1	NOT APPLICABLE	Cr.No.161/2023, Dt. 17/04/2023	UNDER INVESTIGATION; CHARGE SHEET NOT FILED	U/S 294, 34, 352 IPC, 3(1) (r) 3(1) (s) SC.ST.POA ACT U/S 143, 342, 186, 188, 353, 341 r/w 149 IPC & Sec. 32 of Indian Police Act, 1860. Allegad GALATA NEAR AMBEDKAR STATUE, GUNTUR.
2	NOT APPLICABLE	Cr. No. 276/2014	Not Applicable	U/S 188 IPC
3	A.P HIGH COURT	CRLRC/587/2023, A.P HIGH COURT, AMARAVATHI	APPEAL PENDING	PROTECTION OF WOMEN FROM DOMESTIC VIOLENCE CASE. REVISION AGAINST APPEAL ORDER IN CRLA NO. 34 OF 22 IN DVC NO. 113 OF 2018
4	A.P HIGH COURT	CRLRC/646/ 2023, A.P HIGH COURT, AMARAVATHI	APPEAL PENDING	PROTECTION OF WOMEN FROM DOMESTIC VIOLENCE CASE. REVISION AGAINST APPEAL ORDER IN CRLA NO. 41 OF 22 IN DVC NO. 113 OF 2018

(B) Details about cases of conviction for criminal offences: **NOT APPLICABLE**

Sl.No.	Name of court & date(S) of order(S)	Description of offence(S) & punishment imposed	Maximum punishment imposed
1	Nil	Nil	Nil

సంపాదకీయం

మోదీ అబద్ధాలకు మోహన్ భగవత్

రిజర్వేషన్ల అంశాన్ని సంఘ్ పరివార్ మరోసారి చర్చనీయాంశం చేసింది. రెండో విడత పోలింగ్ ముగియకముందు ప్రధానమంత్రి మోదీ దగ్గర నుంచి చిన్నా చితకా బీజేపీ నేతల దాకా తమకు 400 సీట్లకు పైగా వస్తాయని ఊదరగొట్టారు. కానీ మొదటి దశ పోలింగే బీజేపీకి అనుకూలంగా లేదన్న వ్యాఖ్యానాలు వినిపించాయి. రెండో దశ పోలింగ్ తరవాత ఈ వ్యాఖ్యలకు అదనపు బలం చేకూరింది. అప్పటి నుంచి మోదీ తమకు 400కు మించి లోకసభ స్థానాలు వస్తాయి అని చెప్పడం మానేశారు. కానీ ఇతర నాయకులు 400 సీట్లకన్నా ఎక్కువ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బాహాటంగానే చెప్పారు. 2024 ఎన్నికలలో బీజేపీకి అపూర్వమైన విజయం చేకూరితే రాజ్యాంగాన్ని మార్చేయాలని బీజేపీ నాయకుడు అనంత్ కుమార్ హెగ్డే మార్చిలోనే ప్రకటించారు. అంతకు ముందు కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఆ తరవాత రాజస్థాన్ నుంచి లోకసభకు పోటీ పడ్డ జ్యోతీ మిర్ధా ఇదే మాట చెప్పారు. "దేశ ప్రయోజనాలకోసం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవలసి వస్తుంది. అయితే రాజ్యాంగాన్ని మార్చాలంటే మాకు పార్లమెంటు ఉభయ సభల్లోనూ మూడింట రెండువంతుల సీట్లు కావాలి" అన్నారు. అయోధ్య నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కూడా ఇదే మాట పునరుద్ఘాటించారు. ఆ తరవాత మీరట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరుణ్ గోవిల్ ఇవే మాటలను తన శైలిలో మరో సారి చెప్పారు. అరుణ్ గోవిల్ దూరదర్శన్ కోసం రామానంద సాగర్ నిర్మించిన రామాయణంలో శ్రీ రాముడి పాత్ర పోషించారు. ఈ వ్యాఖ్యలు ఎన్నికలలో ప్రతికూల ప్రభావం పడ్తుందని గ్రహించిన మోదీ "రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేద్కర్ మళ్లీ పుట్టి రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించినా అది సాగదు" అని జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ప్రయత్నం చేశారు. కొందరు అవునంటే మరి కొంతమంది కాదని జనాన్ని గందరగోళపరిచే విద్యలో బీజేపీ ఆరితేరి పోయింది. రెండు రకాల వారి లక్ష్యం మాత్రం ఒకటే. రాజ్యాంగాన్ని మార్చడం విషయంలోనూ మోదీ ఎంత గట్టిగా మాట్లాడినా ఆయన ఉద్దేశమూ రాజ్యాంగాన్ని మార్చేయడమే. సంఘ్ పరివార్ రాజ్యాంగాన్ని సవరించాలని కాకుండా మొత్తాన్ని మార్చేయాలని ఆశిస్తోంది. అంటే రాజ్యాంగ మౌలిక స్వరూపంతో పాటు రూపు రేఖలనే మార్చేయాలన్నది సంఘ్ పరివార్ ఆలోచన. పైగా రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడడానికే 400 కన్నా ఎక్కువ సీట్లు కావాలంటున్నాం అని మోదీ అదనపు మసాలా జోడించి చెప్పారు. ఏ మార్పూ చేయకుండానే రాజ్యాంగానికి అనేక గాట్లు పెట్టిన వ్యక్తి మాటల్లో అంతరార్థం ఏమిటో అందరికీ అర్థం అవుతూనే ఉంది. ఈలోగా తాజాగా బీజేపీ మాతృ సంస్థ ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ రంగ ప్రవేశంచేసి రాజ్యాంగానికి అనుగుణమైన రిజర్వేషన్లకు తాము ఎన్నడూ వ్యతిరేకం కాదని అన్నారు. ఇది నూటికి నూరు పాళ్ల బుకాయింపే. అయితే ఆయన మాటలను జాగ్రత్తగా గమనిస్తే రిజర్వేషన్లను సమర్థించినట్టు ఎందుకు కనిపిస్తున్నారో అర్థం అవుతుంది. సందిగ్ధతా మబ్బులు తొలగి పోతాయి. రాజ్యాంగంలో పదేళ్ల దాకానే రిజర్వేషన్లు ఉండాలని చెప్పారన్నది మోహన్ భగవత్ భాష్యం. కానీ ఆ పదేళ్ల పరిమితి చట్ట సభల్లో ఎస్.సి.,ఎస్.టి.ల సీట్ల రిజర్వేషన్ల సందర్భంలో చెప్పారన్న పరమ సత్యాన్ని ఆయన కప్పిపుచ్చుతున్నారు. సంఘ్ పరివార్ వర్గాలే పనిగట్టుకుని రిజర్వేషన్ల విషయాన్ని లేవనెత్తారు కనక, వాటిలో ఏక సూత్రత కనిపించడం లేదు కనక తాము "రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్లకు ఎప్పుడూ వ్యతిరేకులం కాము" అంటున్నారు. కానీ అదే మోహన్ భగవత్ 2015 సెప్టెంబర్ 20న రిజర్వేషన్ల విధానాన్ని పున: సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. 2019 ఆగస్టు 19న రిజర్వేషన్ల అంశంపై సంవాదం జరగాలన్నారు. నిజంగానే బీజేపీ రిజర్వేషన్లకు అనుకూలమైతే సమీక్షలు, సంవాదాల అవసరం ఏమిటో!

మోహన్ భగవత్ రాజ్యాంగం చెప్పిన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకులం కాదు అని చెప్పడంలో అంతరార్థం భిన్నమైంది. మోసపూరితమైంది. కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక స్థితి మీద ఆధారపడిన రిజర్వేషన్లు ఉండాలన్నది ఆయన ఉద్దేశం. రిజర్వేషన్లు ఎవరికి ఏ ప్రాతిపదికన కల్పించారో భగవత్ కు తెలియదనుకోలేం. సామూహికంగా, విద్యావరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగ నిర్ణాయక సభ నిర్దేశించింది. సామాజికంగా, ఆర్థికంగా అన్న నియమాలనుబట్టి చూస్తే దళితులకు, ఆదివాసులకు రిజర్వేషన్లు దక్కాయి. అదే సామాజిక వాస్తవికత. అనుకున్న ఫలితాలు సాధించలేక పోయాం కనక వాటిని ఇప్పటికీ అమలు చేయాల్సి వస్తోంది. భగవత్ మరో మాటా అన్నారు. తరవాత రిజర్వేషన్ల విధానంలో కొన్ని మార్పులూ అనివార్యం అయినాయి. ప్రతిభమీదే ఆధారపడి ఉద్యోగాలు తదితరాలు ఇవ్వాలట. ఈ మాటలు భగవత్ సంఘ్ పరివార్ సిద్ధాంత కర్త మాధవ్ సదాశివరావు గోల్వాల్కర్ నుంచి, హిందుత్వ సిద్ధాంతానికి పునాది వేసిన వి.డి.సావర్కర్ నుంచి అరువు తెచ్చుకున్నారు. గోల్వాల్కర్ ఆర్.ఎస్.ఎస్.కు రెండవ అధినాయకుడు. ఆయనకు ముందున్న హేగ్డేవర్ కూడా అదే మాట చెప్పేవారు. వారి రచనలను, ప్రసంగాలను వింటే ఈ వాస్తవం గ్రహించడం కష్టం కాదు. చాలా కాలం నుంచి ప్రచురితం అవుతున్న ఆర్గనైజర్ పత్రికలోనూ, గోల్వాల్కర్ బంచ్ ఆఫ్ థాట్స్ లోనూ సంఘ్ నేతల ఆలోచనా ధోరణి రూపుకడ్తుంది. బీజేపీ ఐ.టి.సెల్ అధినాయకుడు అమిత్ మాల్వీయ 2013లో ఏప్రిల్ 19న ట్విట్టర్ (ఇప్పుడు ఎక్స్) లో వ్యాఖ్య చేశారు. అన్ని రకాల రిజర్వేషన్లలూ అంతం చేయవలసిన దశలో మహిళలకు రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారు అన్నారు. అయితే ఈ ట్వీట్ ను ఆయన తొలగించారు. దళితులు, ఆదివాసీలు, మహిళలను సంఘ్ పరివార్ గౌరవించిన సందర్భాలకోసం బూతద్దం సహాయంతో వెతుక్కోవాల్సిందే. ఈ వర్గాలు అవసరమైనప్పుడు బీజేపీకి ఓటువేసే జీవులుగా మాత్రమే మిగిలిపోతారు. సామాజిక మాధ్యమాల ద్వారా రిజర్వేషన్లు వ్యతిరేకించేవారూ అపారంగానే కనిపిస్తారు. వారందరి ఆలోచనా ధోరణి ఆర్.ఎస్.ఎస్. కు సంబంధించిందే. రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు సంఘ్ పరివార్‌తో సంబంధంఉన్నా లేకపోయినా వారంతా సంప్రదాయవాదులు, జాతీయతా వాదులు, పురుషాహంకారం ఉన్నవారే. ఈ మూడూ ఒక మూసలో తయారైనవే. మూలం ఒకటే. బీజేపీకి సంకటం ఎదురవుతోందనుకున్న ప్రతి సందర్భంలో మోహన్ భగవత్ రంగంలోకి దూకుతారు. భిన్నమైన భాషలో మాట్లాడుతున్నట్టు కనిపిస్తారు. కానీ ఆయన మూలభూతమైన తాత్వికతలో తేడా ఏమీ కనిపించదు. తిరోగమన వాదులను రెక్కల కింద పెట్టుకుని కాపాడడమే ఆయన పరమ లక్ష్యం.

మేడే వర్తమానకాల ప్రాధాన్యత

చలసాని వెంకటరామారావు

మే 1 ప్రపంచ కార్మికుల పోరాట సంఘీభావ దినం. ఇది 138 ఏళ్లుగా పెట్టుబడిదారుల దోపిడీ దాడులకు వ్యతిరేకంగా కార్మిక వర్గ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచింది. పెట్టుబడిదారీ వర్గ దోపిడీకి వ్యతిరేకంగా కార్ల్‌మార్క్స్ 186 ఏళ్ల క్రితం కమ్యూనిస్టు మానిఫెస్టోను విడుదలచేసి "ప్రపంచ కార్మికులారా! ఏకంకండి!" అని నినదించాడు. ఆ స్ఫూర్తిని ప్రపంచానికి అందించింది 'మేడే' ఉద్యమం. అమెరికన్ కార్మికోద్యమం ఎనిమిది గంటల పని విధానం కోసం, ప్రత్యేకంగా చికాగో కార్మికులు అందించిన పోరాట స్ఫూర్తి ప్రపంచ కార్మికులను తట్టి లేపింది. 1886 మే 1 వ తేదీన ఎనిమిది గంటల పని ఉద్యమం ప్రారంభమైంది. చికాగోలోని మెకార్మిక్ కర్మాగారం దీనికి కేంద్ర బిందువు అయ్యింది. 1886 కు ముందే అమెరికాలో పనిగంటల తగ్గింపు డిమాండ్‌తో అనేక సమ్మెలు జరిగాయి. ఈ సమ్మెలలో చికాగో నగరం ప్రముఖపాత్ర వహించింది. 1880 ప్రాంతానికే చికాగో నగరం పారిశ్రామికంగా నిలదొక్కుకుంది. నూతన యంత్రాల రాకతో కార్మికుల ఉద్యోగాలుపోయి నిరుద్యోగం పెరిగింది. దీనితో పనిగంటలు పెంచి, తక్కువ వేతనాలతో శ్రామికులను దోపిడీ చేయటం యాజమాన్యాలు ప్రారంభించాయి. చికాగోలో జరిగిన ఒక భారీ అగ్ని ప్రమాదం కారణంగా లక్షమంది నిర్వాసితులు కాగా 250 మంది చనిపోయారు. వీరి సహాయార్థం అమెరికాలోని శ్రామికులు ఫ్రాన్స్, జర్మనీ దేశాల పౌరులు 50 లక్షల డాలర్లకు పైగా విరాళాలు ఇచ్చారు. ఈ విరాళాలను బాధితులకు అందించడానికి వేలమంది శ్రామికులు సహాయ శిబిరాలకు వెళ్లగా వారిని అక్కడ తీవ్రంగా హింసించారు. దీనికే 'రొట్టెల దొమ్మి' అని పేరు. మెకార్మిక్ కర్మాగారంలో1884 ప్రారంభం నుండి సమ్మెలు, లాకౌట్లు 1986 మే వరకు కొనసాగాయి. ఎనిమిది గంటల పనిదినం కోసం అమెరికా అంతట సమ్మెలు జరుగుతున్న సమయంలో 1886 మే 3వ తేదీ మెకార్మిక్ కర్మాగారం వద్ద కార్మికులకు, యాజమాన్యానికి మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశ అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ పాలనాకాలంలో ఇల్లినాయిస్ రాష్ట్రంలో 'చట్టబద్ధమైన పనిదినం' పేరుతో ఒక శాసనం ఆమోదించారు. కానీ ఈ శాసనం అమలుకు నోచుకోలేదు. దీనితో 8 గంటల పనిదినంకోసం కార్మికులు పోరాడవలసి వచ్చింది.

1886 మేడే రోజున అనేక ఘటనలు చోటు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 1200 ఫ్యాక్టరీలలో పనిచేసే 3 లక్షల 40 వేల మంది కార్మికులు పని నిలుపుచేశారు. వీరిలో 80,000 మంది కార్మికులు చికాగోలో ఉన్నారు. సమ్మెకు ముందు 45 వేల మంది కార్మికులకు 8 గంటల పనిదినం ఇస్తామని యజమానులు వాగ్దానంచేసినప్పటికీ ఆచరణలో దానిని అమలు చేయలేదు. దానితో కార్మిక సమ్మెలు కొనసాగాయి. 1886 మే 4న సాయంత్రం 7.30 గంటలకు హే మార్కెట్ సెంటరులో 2,500 మంది కార్మికులతో సభ ప్రారంభమైంది. చికాగో మేయరు కార్టర్ హారిసన్ అనుమతితో జరుగుతున్న ఈ సభలో ఆగస్టు స్పస్ క్లుప్తంగా ఉపన్యసించాడు. ఆ తరువాత ఆల్బర్ట్ పార్సన్స్ గంటసేపు సుదీర్ఘ ఉపన్యాసం చేశాడు. దాదాపు సభ ముగియనుండగా మేయర్ హారిసన్ సమీపంలోని తన ఇంటికి వెళ్లిపోయాడు. 176 మంది పోలీసులు, 200 మంది సభకు వచ్చిన కార్మికులు అక్కడ ఉండగా ఎవరో అకస్మాత్తుగా బాంబు విసిరారు. బాంబు విసిరింది ఎవరోఎవరికీ తెలియదు. కార్మికుల దుస్తులలోఉన్న పోలీసుల పనే ఇది అని కార్మిక నాయకుల అనుమానం. అమెరికాలో ఈ విధంగా బాంబు ప్రయోగించటం ఇదే మొదటిసారి. ఎలాంటి కారణం చూపకుండానే చికాగోలో

100 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. 31 మందిపై నేరారోపణ చేశారు. తరువాత ముద్దాయిల సంఖ్యను 11 మందికి తగ్గించారు. ఇద్దరు ప్రభుత్వ సాక్షులుగా మారిపోయారు. చివరకు 8 మందిని కోర్టులో విచారించారు. వీరిలో ఒకరు బోధకుడు, కార్మిక సంఘ నాయకులు, కార్మిక పత్రిక ప్రతినిధి, రాజకీయ నాయకులు ఉన్నారు. 1886 జూన్ 21 న విచారణ ప్రారంభమైంది, అప్పుడు అల్బర్ట్ పార్సన్స్ కూడా విచారణకు హాజరై ముద్దాయిలలో కలిశాడు. కేసు విచారించిన న్యాయాధికారి జోసఫ్ ఇగారే తీరు న్యాయాన్ని అపహాస్యంచేసే తీరులో విచారణ జరిగింది. చివరకు ఆస్కార్ నీబేని మినహాయించి మిగిలిన వారందరిని దోషులుగా నిర్ణయించిన జ్యూరీ మరణశిక్ష విధిస్తూ ఉరి తీయవలసిందిగా తీర్పు ఇచ్చింది. నీబేకు సోవియట్ కారాగారంలో 15 ఏళ్ల కఠిన శ్రమను శిక్షగా విధించారు. ప్రపంచమంతా ఈ శిక్షను వ్యతిరేకించింది. అంతర్జాతీయ కార్మిక సంఘీభావం వ్యక్తమైంది. అనేక సభలు జరిగాయి. శిక్ష రద్దుకు విజ్ఞాపనలు వచ్చాయి. రక్షణ నిధికి ప్రపంచమంతటి నుండి విరాళాలు వచ్చాయి. ఎనిమిది మందిలో 5 గురిని ముందుగా ఉరి తీసారు. 1887 నవంబరు 11 న ఉరి అనగా 10 వ తేది జైలు గదిలో లూయిస్‌లింగ్ మృతుడై ఉన్నాడు. డైనమెట్ పేలుడు కారణంగా అతను ముక్కలై చనిపోయాడు. ఉరి అమలు రోజున కార్మికులు పెద్ద సంఖ్యలో జైలును ముట్టడించాలని అనుకున్నా ఉరిశిక్ష ఎదుర్కొంటున్న వారు దానిని నిరాకరించారు. నవంబరు 11 వ తేది శుక్రవారం (బ్లాక్ ఫ్రైడే) నాడు మధ్యాహ్నం నలుగురిని ఉరి తీశారు. 12 వ తేదీ మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించగా అంతిమ దర్శనానికి వేలమంది వారి ఇళ్ల వద్దకు బారులు తీరారు. 1893 జూన్ 25న వాల్డీమ్ శ్మశానంలో హే మార్కెట్ అమరులకు అత్యంత సుందరమైన స్మారక చిహ్నాన్ని నెలకొల్పారు. పని గంటలు తగ్గింపు కోసం చికాగోలో సాగిన ఉద్యమం రక్తతర్పణతో ముగిసింది. అయినా హే మార్కెట్ సభలో బాంబు పేలుడు, 8 గంటల పని కోసం మేడే ప్రదర్శనలు, ఉరిశిక్ష అమలువంటి ఘటనలు ప్రపంచ వ్యాపితంగా కార్మిక వర్గంపై తీవ్ర ప్రభావాన్ని కలిగించాయి. 1889 జులై 14 న పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ కార్మిక మహాసభ మేడేను అంతర్జాతీయ శ్రామిక దినంగా ప్రకటించింది. కార్మికుల సంఘటిత హక్కుల కోసం ఈరోజున కష్టజీవులందరు ప్రదర్శనలు నిర్వహిస్తారు. 1890 మే 1 నుండి ప్రపంచ వ్యాపితంగా "మేడే" చికాగో అమరుల స్మారక దినంగా జరుపుతున్నారు. మనదేశంలో ఏఐటీయూసీ ఆదేశం ప్రకారం బొంబాయి, కలకత్తా, మద్రాసు నగర పారిశ్రామిక కేంద్రాలలో 1927 లో మే దినోత్సవం జరిగింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం దేశమంతట మే దినోత్సవం జరుపుకోవటం ఒక ఆనవాయితీగా కార్మికవర్గం స్వీకరించింది. 1923లోనే తొలిసారి మద్రాసు మెరీనా బీచ్‌లో సింగారవేలు చెట్టియార్ నాయకత్వంలో ఎర్రజెండా ఎగురవేసి మే దినోత్సవాన్ని జరిపారు. భారతదేశంలో కార్మికుల పోరాటాలవల్ల 1881లో ఫ్యాక్టరీల చట్టం వచ్చింది. దానివల్ల 15 గంటల పనినుండి సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు పనిగంటలు నిర్ణయించారు. తర్వాత 1920లో 10 గంటల పనివిధానం, 1930-34 ప్రాంతంలో పోరాటాల వల్ల 9 గంటల పనిదినం వచ్చింది. 1948లో స్వాతంత్ర్యానంతరం కార్మిక పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం 8గంటల పనివిధానాన్ని అమలులోకి తెచ్చింది.

భారతదేశంలో 1991 నుండి ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల పుణ్యమా అని కార్మికుల పనిగంటలు పెంచాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. దీనితో పాటు సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి చెంది కంప్యూటర్ల వినియోగం పెరిగిపోవటంతో కార్మికుల పనివిధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. దీనిలో భాగంగా ఆఫీసులకు వెళ్లవలసిన అవసరంలేకుండా 'వర్క్ ఫ్రం హోం' వంటి పని పద్ధతులు వచ్చాయి. దీనివల్ల పనికి టార్గెట్ నిర్ణయించి ఆ పని పూర్తయ్యేవరకు పని చెయ్యాలనే విధానం వచ్చింది. దీనితో తిరిగి 15 గంటల వరకు పని చేయవల్సిన పరిస్థితులు వచ్చాయి. ఉద్యోగుల వేతనాలస్థాయి పెరిగినప్పటికి రెట్టింపు పని చేయవలసిరావటంతో ఒత్తిడి పెరిగి ఉద్యోగులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. సాఫ్ట్‌వేర్ పుణ్యమా అని పని పరిస్థితులలో వచ్చిన మార్పులు కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి తోడు గత 10 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించటమే కాకుండా ఎన్నో దశాబ్దాలుగా భారత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసిన కార్మిక కోడ్‌లు నాలిగింటిని తీసుకువచ్చింది. ఈ కోడ్‌లు అమలు జరిగితే కార్మికులు ఎన్నో హక్కులు కోల్పోనున్నారు. ఇటీవలి కాలంలో కార్మిక నాయకుల కృషి, నిరంతర పోరాటాలవల్ల సాధించుకున్న సంక్షేమ బోర్డులు రద్దు కానున్నాయి. మోదీ ప్రభుత్వం ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో శాశ్వత ఉద్యోగాలకు తిలోదకాలు ఇచ్చి, కార్మికులకు 12 గంటల పని విధానాన్ని ఆమోదిస్తున్నది. ఇది అంతర్జాతీయ కార్మిక సంస్థ ఐఎల్‌ఓ ప్రమాణాలను ఉల్లంఘించటమే. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతున్నది. కొత్త పరిశ్రమల రాక, ఉపాధి అవకాశాలు లేక యువత నిరాశా నిస్పృహలతో ఉంది. ఈ దశలో పని గంటలు పెంచితే నిరుద్యోగ సమస్య మరింత పెరిగి ప్రజలలో నేర ప్రవృత్తి మరింతగా పెరిగే ప్రమాదం ఉంది. మనదేశంలో కొంతమంది పారిశ్రామికవేత్తలు వారానికి 70 గంటలకు పైగా కార్మికులు పనిచేయాలనే వాదన ముందుకు తెచ్చారు. 'న్యూ ఎకనమిక్ ఫౌండేషన్' సంస్థ నిరుద్యోగం, అసమానతలు, అధిక పని ఒత్తిడి, కుటుంబ సంక్షేమం, అధిక కర్బన ఉద్గారాల సమస్యల దృష్ట్యా 21 గంటల ప్రామాణిక పనివారం ఉండాలని చెప్పింది. నేటి సాంకేతిక పురోగతిలో అనివార్యంగా మానవశ్రమ వినియోగం తగ్గినందున పని గంటలు తగ్గించాల్సిన తప్పనిసరి పరిస్థితులు వచ్చాయి. ఆధునిక సాంకేతికయుగంలో ఉత్పత్తి ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పెట్టుబడిదారుల లాభాలకోసం పనిగంటలు పెంచితే సమాజంలో ఆర్థిక అసమానతలు మరింతగా పెరిగిపోతాయి. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా తక్కువ పని గంటలతో ఎక్కువ ఉత్పత్తి సాధించాలి. అంతర్జాతీయ కార్మిక చట్టాలను గౌరవించాలి. 138 ఏళ్ల క్రితం చికాగో కార్మికులు చిందించిన రక్తం సాక్షిగా వచ్చిన ఎనిమిది గంటల పనివిధానాన్ని రక్షించుకోవాలి. పెట్టుబడిదారులు, సంపన్నుల కొమ్ము గాస్తున్న పాలకవర్గాల కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం పోరాటం సాగించాలి. "పోరాడితే కార్మికులకు పోయేదీ ఏమీలేదు, బానిస సంకెళ్లు తప్ప. ప్రపంచ కార్మికులారా ఏకం కండి!" అన్న మార్క్స్ నినాదం ప్రతి కార్మికుని గుండెల్లో ప్రతిధ్వనించాలి.

(నేడు మే దినోత్సవం)

ఏఐటియూసి రాష్ట్రకార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్: 9490952093

ప్రత్యామ్నాయ రాజకీయాలే అవశ్యం

గతం గతః, భవిష్యత్ ఎలా ఉండాలో నీవే నిర్ణయించుకోవాలి. అంటే వర్తమానంలో కేవలం కలలు కంటే సరిపోదు. భవిష్యత్ కు అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. ఈ రోజు ఓ చారిత్రాత్మకమైన రోజు. ఈ నెలంతా కార్మికుల మాసమే. ప్రపంచంలో పనిచేసే వారంతా ఏకం కావాలని నినదించిన రోజు. కానీ నేడు ఏకం కావలసిన, పనిచేసే సమూహాలు, ఒకే ప్రాంగణంలో కలసి పనిచేసే కార్మికులంతా పెట్టుబడి దారి వర్గాల ఎత్తులతో చిత్తు చిత్తుగా ఛిద్రమై, ముక్కలు చెక్కలుగా విడివడి ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. కొందరు ప్రలోభాలకు లొంగిపోయి యాజమాన్యాల తొత్తులుగా మారి సహా కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నారు. రాను రాను వ్యక్తి స్వామ్యానికి బానిసలవుతున్నారు. ఐకమత్యం అనే మాటకు అర్థం లేకుండా చేస్తున్నారు. సమస్య ఉన్న వారంతా ఏకం కాకుండా ఏమీ సాధ్యం కాదు. ఇదిలా ఉంటే మరోపక్క ఎవరైతే ఈ కార్మిక వర్గానికి పనికల్పించి వీరి శ్రమ సంపదను దోచుకు బతికే దోపిడీ దారులు ఉన్నారో వారంతా వారి మధ్య పోటీ, వైరుధ్యాలు ఎన్ని ఉన్నా, వాటిని పక్కన పెట్టి ఏకమై వారి వర్గ ప్రయోజనాలను కాపాడే వారి తాబేదార్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొని ఇప్పుడు నడుస్తున్న ప్రజాస్వామ్య వ్యవస్థను హస్తగతం చేసుకుని పనిచేసే కార్మికవర్గంపై, ముడి సరుకులు ఉత్పత్తిచేసే రైతులకు వ్యతిరేక చట్టాలు చేయించుకోవటం, ఖనిజ సంపదను కొల్ల గొట్టడానికి, భూముల్ని హస్తగతం చేసుకోడానికి అవసరమైన చట్టాల్ని చేయించుకొని యధేచ్ఛగా దోపిడి కొనసాగిస్తున్నారు. దానికి వారి మధ్య ఎన్ని వైరుధ్యాలు ఉన్నా వాటిని పక్కన పెట్టి "నీకిది నాకది" అనే ఆశ్రితపెట్టుబడీదారీ వ్యవస్త దిశగా శరవేగంతో దూసుకు పోతున్నారు. దీనిలో ఎవరి ప్రయోజనాలు వారికున్నాయి. వారు చివరకు రాజ్యాంగాన్ని సహితం తుంగలో తొక్కి వేస్తున్నారు. రాజ్యాంగానికి మూల స్తంభాలైన పోలీసు వ్యవస్థను, న్యాయ వ్యవస్థను వారి గుప్పెటలో బంధించి బయటకు రాజ్యాంగ బద్ధంగా చేస్తూన్నట్టే కనిపిస్తూ నటిస్తూనే ప్రశ్నించే గొంతుకలను జైళ్లలో కుక్కుతున్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కుల్ని సహితం నూతనంగా నెలకొల్పిన చట్టాలను అడ్డుపెట్టుకొని భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు.

ఏదైనా సంస్థ కావచ్చు, పోలీస్ కావచ్చు, ప్రజలు కావచ్చు ఎవరైనా ఎవరి మీదనైనా ఒక అభియోగం మోపి కేసుల్లో ఇరికించవచ్చు. ఎవరిపై అభియోగం మోపబడిందో ఆ నేరం తో సంబంధం లేదని నేరం మోపబడిన వాడే రుజువు చేసుకోవాలి. ప్రభుత్వం తరఫున పోలీస్ పెట్టిన కేసులకు చార్జిషీట్లు పెట్టకుండా బెయిల్ ఇవ్వకుండా సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్న నిరపరాధులను చూస్తున్నాం. ఇటు ప్రభుత్వం గాని పోలీస్ వ్యవస్థ ఎవరైనా ఒకరో ఇద్దరో మానవత్వం ఉన్న న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల్ని సహితం అమలు చేయటం లేదు. కోర్టులు ప్రభుత్వానికి, పోలీస్ అధికారులకు చివాట్లు పెట్టినా సిగ్గు పడడం లేదు. తుడుచుకు పోతున్నారు. న్యాయాన్ని చట్టాన్ని కాపాడవలసిన వారే వారి బాధ్యతల నుండి పక్కకు వైతొలగుతున్నారు. కోర్టులు తమ పరిధిలో న్యాయాన్యాయాలను విచారించి ఏదైనా తీర్పులు చెప్పినా అమలు చేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి, ఆ పార్టీల నాయకుల, కార్యకర్తలకు అనుకూలంగా వ్యవహరించి, ప్రశ్నించే గొంతులు నొక్కడమే పనిగా వ్యవహరిస్తున్నారు. ఈ నాయకుడు తన సొంత ఆస్తులు అమ్మి, లేదా తాను అక్రమంగా సంపాదించి కూడేసిన సంపదనుండి ఓ చిల్లు దమ్మిడీ కూడా ప్రజలకోసం ఖర్చు చేయడు. ఖర్చు ప్రజా ధనమే తామేదో దానం చేస్తున్నట్టు మైకులు పట్టుకొని ఊక దంపుడు ఊదరగొడతారు. వీళ్ళు ఏ రోజు ఈ దేశం కోసం, ప్రజల కోసం ఏమి త్యాగం చేశారో, భవిష్యత్‌లో ఏమి త్యాగం చేస్తారో వివరించరు. కనీసం ప్రభుత్వ రంగ సంస్థలన్నీ, ప్రభుత్వ ఆస్తులన్నీ మా తాబేదార్లకు అప్పనంగా అంటకడతాం అని బాహాటంగానూ చెప్పలేరు. అయినా చేసేది అదే.

ఏదో సినిమాలో ఓ పిచ్చోడు ఏ పని చెయ్యాల్సి వచ్చినా, సమాచారం ఇవ్వాల్సి వచ్చినా చేయి చాపి 'పది పైసలిస్తే' అంటుంటాడు. రాజకీయ నాయకులు కూడా ఏ పని చేసినా వారి పది పైసలు వారికి కావాలి. అంతా నాకిది, నీకిది నడుస్తుంది. కాబట్టి ఈ వ్యవస్థను అడ్డుపెట్టుకొని రాజకీయ నాయకులు, వారికి అంటిపెట్టుకొని ఉన్న ప్రభుత్వ అధికారగణం ఒక ప్రక్క వారి అడుగులకు మడుగులొత్తుతూనే కోట్ల ఆస్తులు కూడబెడుతున్నారు. వారిరువురి మధ్య ఎల్లపుడూ మిత్ర బంధం కొనసాగుతూనే ఉంటుంది. ఒకరి లొసుగులు ఒకరికి తెలుసు. కాబట్టి ఒకరినొకరు బయటపెట్టుకోరు. ఇక పెట్టుబడిదారీ పార్టీలన్నీ ఒకే వైఖరి అవలంబిస్తాయి. ఒకరు టాటానయితే, మరొకరు బిర్లాను, ఒకరు 'అ''ఆ' లతో సంబంధాలను ఏర్పరుచుకుంటే, ఇంకొకరు ఇ, ఈ లను అంటకాగుతారు. అఆ లు ఇఈ లు ఎవరైనా పెట్టుబడి దారులే. వీరంతా ఇప్పుడు మోసాలకు అనుయాయులే. అధికారంలో ప్రభుత్వాలు ఏవి ఉన్నా అవి వీరివే. అవన్నీ వీరి కనుసన్నల్లోనే మెలుగుతూ ఉంటాయి. ఈ పెట్టుబడిదారి ప్రభుత్వాలు పేర్లు ఏవైనా ఎప్పుడూ ఒకరికి బదులు ఒకరు ప్రత్యామ్నాయం కాదు. ప్రస్తుత తరుణంలో రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకో వలసి ఉంది. ఈ ఓటు నీ చేతిలో వున్న ఏకైక వజ్రాయుధం. దాన్ని ప్రయోగించి నీకున్న వ్యతిరేకవర్గాన్ని ఓడించు. నీ ప్రయాణానికి ఇదే తొలిమెట్టు కావాలి.

బంగారు వి.బి.ఆచార్యులు
సెల్:9849579569

బీజేపీ ఓటమే రాజ్యాంగ రక్ష

డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి

దేశ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా పని చేసిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) ప్రేరణతో ఏర్పాటైనదే బీజేపీ. ఆ సంస్థే ఆ పార్టీకి దిశా నిర్దేశం చేస్తుంది. స్వాతంత్ర్యానంతరం మన దేశం కోసం రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ చేసిన వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవి. మనువాదం మా అంతరాత్మ. ఎన్నటికీ ప్రస్తుతం రాయబోతున్న రాజ్యాంగాన్ని అంగీకరించబోమని ఆర్ఎస్ఎస్ స్పష్టం చేసింది. భారత దేశం వేద కాలం నుండీ ప్రాచీన సంస్కృతి ద్వారా వచ్చిన మనుస్మృతి ఉండగా కొత్తగా రాజ్యాంగం అవసరం లేనేలేదని వాదించింది. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైన కొద్ది రోజులకే ఇదే అభిప్రాయాన్ని 1949 నవంబరు 30 న విడుదలైన తమ ఆర్గనైజరు పత్రికలో "మనుధర్మ శాస్త్రం ప్రకారం" ఈ దేశ పాలనా వ్యవహారాలు నడవాలి. అందులోని రాజధర్మాల ఆధారంగా పాలన సాగాలంటూ సంపాదకీయం రాసింది. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటై తమ పని మొదలు పెట్టగానే రాజ్యాంగ రచనపై మరోసారి విషం కక్కింది. 1950 ఫిబ్రవరి 5న "మను రూల్స్ అవర్ హార్ట్" పేరుతో మరో సంపాదకీయం రాసింది.

తమకు రాజకీయాలకు ఏ సంబంధం లేదని పైకి చెబుతూనే తమ కనుసన్నల్లో నడిచేలా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నేతృత్వంలో జనసంఘ్ పేరుతో రాజకీయ పార్టీని ఏర్పాటుచేసింది. రాజకీయాల్లో ఆ పార్టీ వేగం పుంజుకోకపోవడం, సంఘ్ పరివార్ ఆశయాల సాధన ముందుకు కదలకపోవడంతో జన సంఘ్‌ను రద్దుచేసి ఆ స్థానంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనే కొత్త రూపాన్ని రాజకీయ ముఖంగా జనం మధ్యకు తెచ్చింది. సంఘ పరివార్ వ్యవస్థాపకులు హెగ్డేవార్, గోల్వాల్కర్‌ల సిద్ధాంతాల ఆధారంగా భారతదేశంలో మత రాజకీయాలను ప్రోత్సహించడం ద్వారానే బలపడాలన్నది ఆ పార్టీ ఎత్తుగడ. ఇందులో భాగంగానే హిందూ, ముస్లింల మధ్య విభజన కోసం అయోధ్య రామాలయం నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి అమలు లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఈ మూడు అంశాలు ప్రస్తుతం అమలులో ఉన్న రాజ్యాంగానికి వ్యతిరేకమైనవే.

ముందస్తు ప్రణాళికల మేరకు అయోధ్య రామమందిరం పేరుతో హిందూ ముస్లింల మధ్య చిచ్చు పెడుతూ బాబ్రీ మసీదు విధ్వంసం రూపంలో వారి కుట్రలను అర్థం చేసుకోలేని మెజారిటీ ప్రజల మనో భావాలను రెచ్చగొడుతూ బీజేపీ క్రమంగా లోక్‌సభలో ప్రాతినిధ్యం పెంచుకుంది. పదేళ్ల కిందటి నుంచి అధికారంలో ఉన్నా ఉన్నపళంగా ఒకేసారి రాజ్యాంగం రద్దుచేయడం సాధ్యం కాదు కాబట్టి అందులోని కీలకమైన అంశాలను నిర్వీర్యం చేయడం మొదలు పెట్టింది. ప్రత్యేక పరిస్థితుల్లో జమ్ముకాశ్మీర్‌కు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన ఆర్టికల్ 370ని రద్దు చేసింది. ఇందుకు న్యాయ వ్యవస్థను కూడా ప్రభావితం చేయగలిగింది. రామమందిరం నిర్మాణం విషయంలోను అదే పని చేసింది. ఈ తీర్పుల్లో భాగస్వాములైన న్యాయమూర్తుల్లో కొందరు ప్రత్యక్షంగా బీజేపీతో అంటకాగుతున్నారు. ఇక మూడో అంశం అయిన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అనేది కూడా అమలు చేయడానికి తాజా ఎన్నికల ముందే విధి విధానాలను రూపొందించి రాజ్యాంగం పట్ల తమ వ్యతిరేక వైఖరిని బహిరంగంగానే వ్యక్తం చేసింది. అనేక రాష్ట్రాలు తిరస్కరించిన యూసీసీ అమలుచేసి తీరతామనే వ్యాఖ్యానిస్తోంది. 2014లో తాను ప్రమాణ స్వీకారం చేసిన నాటి రోజుల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ భావ ప్రకటనా స్వేచ్ఛకు భరోసా ఇవ్వలేనపుడు ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదని ఒక సభలో వ్యాఖ్యానించారు. మోదీ మాటలు వేరు చేతలు వేరనే విషయం బయటపడింది. భావప్రకటన స్వేచ్ఛపై తీవ్రమైన అణచివేత కొనసాగింది. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన, మాట్లాడుతున్న వారంతా దేశద్రోహులుగా చిత్రీకరించారు. 'ది వైర్' ఎడిటర్ ఇన్-చీఫ్ సిద్ధార్థ వరదరాజన్, ప్రముఖ జర్నలిస్టు రవీష్ కుమార్, హత్రాస్ ఘటనను రిపోర్టు చేయాలని వెళ్లిన కేరళ జర్నలిస్టు సిద్దిక్ అప్పన్ తదితరులు ప్రభుత్వ ఆగ్రహానికి గురయ్యారు. ఈ తరహా కేసులు జర్నలిస్టులకు వేధించడానికేనని 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' అనేక సార్లు పేర్కొంది. ప్రభుత్వ ప్రయోజిత కేసులు ఎదుర్కొంటున్న వారి జాబితాలో 'కారవాన్' న్యూస్ మేగజైన్ కూడా ఒకటి. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తుందనే అక్కసే ఇందుకు కారణం. తాజాగా భావ ప్రకటన స్వేచ్ఛ విషయంలో 180 దేశాలలో పరిస్థితులను పరిశీలించగా 'వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్'లో భారత్‌కు 142వ స్థానానికి దిగజారింది. దేశంలో భావప్రకటన స్వేచ్ఛ ఉంటే రాజ్యాంగాన్ని బలహీనం చేయలేమనే బీజేపీ ప్రభుత్వ పెద్దలు ఈ పనికి పూనుకున్నట్టు స్పష్టం అవుతున్నది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సోషలిజం అంటే బీజేపీకి గిట్టదు. ఇవన్నీ రాజ్యాంగంలో ఉన్నాయి. దేశంలో తాము కోరుకున్న విధంగా మనుధర్మం ఆధారంగా పాలన సాగాలంటే రాజరికం తరహా పాలనఉండాలి. ప్రజాస్వామ్యం దీనికి అడ్డంకి. అందుకు ప్రజాస్వామ్యం అనే భావనను పూర్తిగా లేకుండా చేయడం తమ ముందున్న కర్తవ్యంగా బీజేపీ పని చేసింది. ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలైన పౌరహక్కుల హననాన్ని సాగించింది. పౌర హక్కులను రక్షించేందుకు రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన అన్ని వ్యవస్థలను క్రమంగా నిర్వీర్యం చేస్తూ వచ్చింది. ప్రజాస్వామ్యం అనే భావన దాని మూల సూత్రాలు భావితరం విద్యార్థులకు చేరకుండా పాఠ్యపుస్తకాల్లోని సిలబస్ నుండి తొలగించాలని చూసింది. రాజ్యాంగ రచన పూర్తయ్యాక 1954లో బొంబాయిలో నిర్వహించిన హిందూ మహాసభలో నాటి సర్ సంచాలక్ గోల్వాల్కర్ మాట్లాడుతూ..."సమాఖ్య స్ఫూర్తికి తాము వ్యతిరేకం. దీన్ని ఆమోదించం. ఇది జాతిని దెబ్బతీస్తుంది. జాతీయత విచ్ఛిన్నమవుతుందని" వ్యాఖ్యానించారు. ఇందుచేతనే బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రాలకు చెందిన అన్ని హక్కులను హరిస్తోంది. రిజర్వేషన్ల విషయంలోనూ ఆర్ఎస్ఎస్ భావజాలాన్నే బీజేపీ మోస్తోంది. ఇదే విషయం ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అనేక సార్లు చెప్పారు. పైకి మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం అంటూనే ఉన్నారు. రాజ్యాంగం ఉంటే రిజర్వేషన్లకు ఢోకా ఉండదు కాబట్టే రాజ్యాంగం ఉండడానికి వీల్లేదనేది వారి ఆలోచన. ఇక ముసుగులో గుద్దులాట ఎందుకు అనుకున్నారేమో బీజేపీకి చెందిన కొందరు నేతలు ఏకంగా తాము రాజ్యాంగాన్ని మార్చడానికి వచ్చామని,చాలా సార్లు బాహాటంగా ప్రకటించారు. ప్రస్తుతం ఎన్నికల తరుణంలో తమకే 370, ఎన్డీఏకి 400 సీట్లు అంటూ మోదీ బీరాలు ప్రకటించగానే ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు రానున్న రోజుల్లో నాలుగింట మూడు వంతుల మెజారిటీతో రాజ్యాంగాన్ని రద్దు చేసేస్తామని వ్యాఖ్యానిస్తున్నారు. ఇకపైన అసలు సినిమా ఉంటుందని మోదీ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలు ఈ కోవలోనివే. ఇప్పటికే జరిగిన రెండు దశల ఓటింగు సరళిపై రాజ్యాంగాన్ని రద్దు చేస్తామనే మాటల ప్రభావం గట్టిగానే పడడంతో అంబేద్కర్ తిరిగి వచ్చినా రాజ్యాంగాన్ని మార్చలేరంటూ మోదీ మళ్లీ కొత్త పల్లవి అందుకున్నారు. అయితే పుట్టుక మొదలు నరనరాన రాజ్యాంగ వ్యతిరేకతను నింపుకున్న బీజేపీని అధికార పీఠం దరిదాపులకు రాకుండా చేయడం ద్వారానే రాజ్యాంగాన్ని కాపాడుకోగలం.

సెల్: 9059837847

అమెరికాలో పన్నూపై హత్యాయత్నం

వాషింగ్టన్ పోస్టు కథనంపై భారత్ ఘాటు స్పందన

న్యూఢిల్లీ: సిక్కు వేర్పాటువాద నాయకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూపై అమెరికా లో జరిగిన హత్యాయత్నంలో గూఢచర్య సంస్థ 'రా' అధికారి ప్రమేయం ఉందని పేర్కొంటూ వాషింగ్టన్ పోస్ట్ పత్రిక ప్రచురించిన కథనంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. దానిపై మీడియా అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ సమాధానం ఇచ్చారు. 'ఒక సున్నితమైన అంశంపై ఆ నివేదిక నిరాధారమైన, అనవసర ఆరోపణలు చేస్తోంది. వ్యవస్థీకృత నేరగాళ్లు, ఉగ్రవాదులు, ఇతరుల నెట్‌వర్క్‌లపై యూఎస్ ప్రభుత్వం అందించిన భద్రతా సమస్యలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. అది దర్యాప్తు కొనసాగిస్తోంది. అలాంటి సమయంలో ఇలాంటి ఊహాజనితమైన, బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చవు' అని తీవ్రంగా మండిపడ్డారు. అమెరికాలోని సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) సంస్థ ప్రతినిధి గురుపత్వంత్ సింగ్ ఖలిస్థానీల కీలక నేత. భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. అమెరికాలో ప్రాణాంతక ఆపరేషన్‌ను భారత గూఢచర్య సంస్థ నిర్వహించడంపై అగ్రరాజ్య అధికారులు విస్మయం వ్యక్తం చేశారని ఆ కథనం పేర్కొంది. అయితే, అమెరికా నిఘా విభాగాలు పన్నూపై హత్యాయత్నాన్ని అడ్డుకున్నాయని తెలిపింది. అలాగే ఆ 'రా' అధికారి పేరు విక్రమ్ యాదవ్‌గా పేర్కొంది. భారత ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితమైన అంతర్గత బృందానికి ఈ ప్లాన్ తెలుసునని వ్యాఖ్యానించింది.

ప్రజ్వల్ రేవణ్ణ సస్పెన్షన్

బీజేపీ పాత్రపై కుమారస్వామి అనుమానం

బెంగళూరు: అశ్లీల వీడియోల వ్యవహారంలో జేడీ(ఎస్) కీలక నిర్ణయం తీసుకుంది. కర్నాటక ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను పార్టీ నుంచి మంగళవారం సస్పెండ్ చేసింది. అలాగే ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. హుబ్బళ్లిలో సమావేశమైన పార్టీ కోర్ కమిటీ రేవణ్ణ తాత అయిన తన జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ... ప్రజ్వల్ రేవణ్ణను సస్పెండ్ చేయాలని సిఫారసు చేసిన కొద్ది నిమిషాలకే వేటు పడింది. హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ మహిళలను వేధిస్తున్నట్లు ఆరోపించిన వీడియోలు సోషల్ మీడియా, మీడియాలో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. ఇది పార్టీకి, దాని నాయకత్వానికి చాలా ఇబ్బందిని కలిగించిందని సస్పెన్షన్ ఆర్డర్ పేర్కొంది. కాగా, ఈ వ్యవహారంపై కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందని పేర్కొంటూ... ఈ నేపథ్యంలో జేడీ(ఎస్) పార్టీ రాజ్యాంగం, క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు, శిక్షకు సంబంధించిన నిబంధనల ప్రకారం ప్రజ్వల్ రేవణ్ణను వెంటనే సస్పెండ్ చేశారు' అని జేడీ(ఎస్) జాతీయ అధ్యక్షుడి ఆమోదం మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కె.ఆర్.శివకుమార్ సంతకంతో సస్పెన్షన్ ఉత్తర్వులు మీడియాకు విడుదలయ్యాయి. శుక్రవారం పోలింగ్ జరిగిన హసన్ నుంచి బీజేపీ-జేడీ(ఎస్) కూటమి అభ్యర్థిగా ప్రజ్వల్ బరిలో నిలిచారు. 33 ఏళ్ల హెచ్‌డి దేవెగౌడ పెద్ద కుమారుడు, ఎమ్మెల్యే, మాజీ మంత్రి హెచ్‌డి రేవణ్ణ కుమారుడు. ప్రజ్వల్ మామ హెచ్‌డి కుమారస్వామి జెడి(ఎస్) రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నారు. కోర్ కమిటీ సమావేశం తర్వాత హుబ్లీలో ఆయన విలేకరులతో ఆ పార్టీ అధినేత, ఎమ్మెల్యే దేవెగౌడ మాట్లాడుతూ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కర్నాటక ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించిందని, దానిని స్వాగతిస్తున్నాం. దర్యాప్తు కొనసాగుతున్నందున, నివేదిక కోసం ఇంకా వేచి ఉన్నాం. ప్రక్రియలో జోక్యం చేసుకోకూడదని, దర్యాప్తునకు పూర్తి సహకారం అందించాలని నిర్ణయించుకున్నాం' అని తెలిపారు. ఇంతకుముందు ఆయన మాట్లాడుతూ 'అతన్ని (ప్రజ్వల్) పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మేము ఏకగ్రీవ తీర్మానం చేశాం. ఈ విషయంలో మా జాతీయ అధ్యక్షుడు హెచ్‌డి దేవెగౌడకు సిఫార్సు చేశాం. అతను (ప్రజ్వల్) లోక్‌సభ సభ్యుడు అయినందున జాతీయ అధ్యక్షుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాం' అని చెప్పారు. ఎంపీ ప్రమేయం ఉన్న లైంగిక కుంభకోణంపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. కోర్ కమిటీ సమావేశంలో జేడీ(ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డి కుమారస్వామి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రమేయం: కుమారస్వామి

ప్రజ్వల్‌పై సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నామని, సిట్ విచారణ నివేదిక, ప్రభుత్వ చర్యల ఆధారంగా సస్పెన్షన్ పదవీకాలం ఉంటుందని కుమారస్వామి తెలిపారు. 'సిట్ విచారణను స్వాగతిస్తున్నాం. ప్రజ్వల్ పాత్రపై సిట్ నివేదిక వచ్చే వరకు సస్పెన్షన్ ఉంటుంది. ఒకవేళ అతడు దోషి అని నివేదికలో వస్తే శాశ్వతంగా సస్పెండ్ చేస్తాం' అని అన్నారు. ఈ వ్యవహారంలో బీజేపీ ప్రమేయం ఉందన్నారు. అశ్లీల వీడియోలతో కూడిన వివాదాస్పద పెన్ డ్రైవ్‌ను బీజేపీ నాయకుడు ఒకరు పంచుకున్నారని పేర్కొంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. 'హసన్‌లో విజయం సాధించడం అసంభవమని గ్రహించిన కుమారస్వామి, బీజేపీ నాయకుడితో సహా విపక్ష నేతలు పెన్ డ్రైవ్‌ను పంచుకున్నారు. మా కుటుంబం ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేశారు. హసన్‌కు చెందిన ఒక సీనియర్ మంత్రి, బీజేపీ నాయకుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది' అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ, జేడీఎస్ మధ్య పొత్తు ఏర్పడింది. ఇప్పుడు ప్రజ్వల కుంభకోణం దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించడంతో కుమారస్వామి ఆరోపణలు బీజేపీ, జేడీఎస్ మధ్య పొత్తును దెబ్బతీసే ప్రమాదం ఉంది.

కర్నాటక పోలీసుల నివేదిక కోరిన ఎన్‌సీడబ్ల్యూ

లోక్‌సభ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) కర్నాటక పోలీసులను మూడు రోజుల్లో నివేదిక కోరింది. కర్నాటక డీజీపీకి రాసిన లేఖలో, రేవణ్ణ బహుళ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు చిత్రీకరించిన అనేక స్పష్టమైన వీడియో దృశ్యాలను సామాజిక మాధ్యమ వేదికలలో ప్రసారం చేయడంతో ఎన్‌సీడబ్ల్యూ ఈ విషయంపై దృష్టి సారించింది. దేశం విడిచి పారిపోయిన నిందితుడిని పట్టుకునేందుకు సత్వర, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కమిషన్ కోరింది. మహిళల భద్రత, గౌరవాన్ని నిర్ధారించడం, వారిపై అగౌరవం, హింసను పెంపొందించే సంస్కృతిని శాశ్వతంగా నిరోధించాల్సిన ప్రాముఖ్యతను కూడా ఇది నొక్కి చెప్పింది. 'కమిషన్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తుంది. ఇది సంభవించినందుకు తీవ్రంగా కలత చెందుతోంది' అని లేఖలో పేర్కొన్నారు. సంబంధిత పోలీసు అధికారులు తీసుకున్న చర్యలను వివరించే వివరణాత్మక నివేదికను మూడు రోజుల్లోగా తమకు సమర్పించాలని కమిషన్ కోరింది.

ప్రధాని పదవినీ పంచుకుంటారు

ఇండియా కూటమిపై మోదీ విసుర్లు

లాతూర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శల దాడి తీవ్రతరం చేశారు. మహారాష్ట్రలోని లాతూర్‌లో మంగళవారం జరిగిన భారీ ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ వాయిదాల పద్ధతిలో ప్రధానులను అందించేవారు భారీ లక్ష్యాలను సాధించగలరా అని ప్రశ్నించారు. ఏటా ఓ ప్రధానిని వంతులవారీగా ఎన్నుకోవాలని విపక్ష ఇండియా కూటమి నిర్ణయించిందని మోదీ అన్నారు. భారత్‌ను ముక్కలుగా చూడాలనుకునే వారు ప్రధాని పదవిని కూడా పంచుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులను మార్చాలనే వారి ఆలోచనకు అర్థం దేశాన్ని వంతులవారీగా లూటీ చేసేందుకేనని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. ఇక 2014కు ముందు ప్రతిరోజూ బాంబు పేలుడు ఘటనల గురించి వార్తాపత్రికల్లో హెడ్‌లైన్స్ వచ్చేవని ఇప్పుడు అలాంటి వార్తలకు చోటు లేకపోవడంతో పాటు భారత్ తన సరిహద్దులను కూడా దీటుగా కాపాడుకుంటోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో రోజూ గుర్తుతెలియని వస్తువులపై హెచ్చరిస్తుండేవారని, కీలక ప్రదేశాల్లో రోజూ 24 గంటల పాటు ఇలాంటి హెచ్చరికలు ఉండేవని గుర్తుచేశారు. మోదీ ప్రధాని కాగానే ఈ తరహా వస్తువులు ఏమై పోయాయని ప్రశ్నించారు.

పాక్‌కు బాలాకోట్ దాడుల సమాచారం ఇచ్చాం

కర్నాటకలోని బాలాకోట్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... 'వెనక నుంచి దాడులు చేయడాన్ని మోదీ నమ్మడు. దేనినైనా ధైర్యంగా ముఖాముఖీ చేస్తాడు. బాలాకోట్‌పై సర్జికల్ స్ట్రైక్స్ చేసిన తర్వాత మీడియాకు సమాచారం అందించాలని భద్రతా బలగాలు చెప్పాయి. ఈ విషయాన్ని అదే రాత్రి.. పాకిస్తాన్‌కు టెలిఫోన్ ద్వారా చెప్పడానికి ప్రయత్నం చేశాం. కానీ పాక్ టెలిఫోన్ కాల్‌కు స్పందించలేదు. తర్వాతే ఈ దాడుల విషయాన్ని ప్రపంచానికి తెలియజేశాం. మోదీ ఎటువంటి విషయాన్ని దాచిపెట్టడు. ప్రతి విషయాన్ని బహిరంగంగా వెల్లడిస్తాడు' అని ప్రధాని మోదీ తెలిపారు. 'పాకిస్తాన్‌లోని బాలాకోట్‌లో సర్జికల్ స్ట్రైక్స్ జరిపినప్పుడు. చాలా మంది కర్నాటకలోని బాలాకోట్ అనుకున్నారు. అందుకే వెంటనే తాము సర్జికల్ స్ట్రైక్స్ సంబంధించి మీడియాకు సమాచారం ఇచ్చాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇక.. పుల్వామాలో జైషే మహమ్మద్ ఉగ్రవాదులు జరిపిన దాడులకు ప్రతీకారంగా భారత బలగాలు పాక్‌లోని బాలాకోట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే.

శిశువులకు పీసీవీ 14 వ్యాక్సిన్ సురక్షితమే

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థ బయోలాజికల్-ఇ మరో ఘనత సాధించింది. న్యూమోనియాను, బ్యాక్టీరియా సంబంధిత వ్యాధులను ఎదుర్కొనేందుకు అభివృద్ధి చేసిన 14-వాలెంట్ న్యూమోకాకల్ కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ-14) సురక్షితమని నిర్ధారణ అయింది. వ్యాక్సిన్ అనే అంతర్జాతీయ జర్నల్‌లో ఫేజ్-3 క్లినికల్ ట్రయల్స్ ఫలితాలను ప్రచురించారు. పీసీవీ-14 వ్యాక్సిన్‌కు సంబంధించిన నివేదికను ఆ జర్నల్‌లో ప్రచురించారు. ఈ వ్యాక్సిన్‌ను 6 నుంచి 8 వారాల శిశువులకు ఇచ్చినట్లైతే న్యూమోనియాను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. భారత్‌తోపాటు ఇతర దేశాల్లో ఐదేళ్లలోపు వయసున్న ఎంతో మంది పిల్లల మరణాలకు కారణమవుతున్న న్యూమోనియాను నిరోధించేందుకు పీసీవీ-14 వ్యాక్సిన్ ఉపయోగపడుతుంది. 14 రకాల స్ట్రెప్టోకోకస వైరస్ వేరియంట్లను ఎదుర్కోగలదు. భారత్‌లో అధికంగా వ్యాప్తి చెందుతున్న 22 ఎఫ్, 33 ఎఫ్ రకం స్ట్రెప్టోకోకస్ వైరస్ నుంచి సమర్థవంతంగా రక్షణ కల్పిస్తుంది. ఈ సందర్భంగా బయోలాజికల్-ఇ లిమిటెడ్ ఎండీ మహిమా దాట్ల మాట్లాడుతూ పీసీవీ-14 వ్యాక్సిన్ ఫేజ్-3 క్లినికల్ ట్రయల్ ఫలితాలను వ్యాక్సిన్ అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ వ్యాక్సిన్ ప్రయోగంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాక్సిన్ తయారీ వెనుకాల ఆర్ ఎండ్ డీ కృషి ఎంతో ఉందన్నారు. ఇలాంటి అంశాలు ఉద్యోగులకు ప్రేరణ ఇస్తాయని దాట్ల అన్నారు.

'న్యూస్‌క్లిక్' పురకాయస్థపై 'ఉపా' ఛార్జిషీట్

విచారణకు స్వీకరించిన దిల్లీ కోర్టు

న్యూఢిల్లీ : చైనా అనుకూల ప్రచారం కోసం న్యూస్ పోర్టల్‌కు డబ్బు అందిందన్న ఆరోపణల ఆధారంగా ఉగ్రవాద నిరోధక చట్టం యూఏపీఏ కింద న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు, ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పురకాయస్థపై దాఖలయిన ఛార్జిషీట్‌ను దిల్లీ కోర్టు మంగళవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో నిందితులపై తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని, ఛార్జిషీట్ కాపీని పురకాయస్థకు అందించాలని అదనపు సెషన్స్ జడ్జి హర్దీప్ కౌర్ ఆదేశించారు. అభియోగాల రూపకల్పనపై వాదనలను మే 31కి న్యాయమూర్తి నిర్ణయించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారేందుకు న్యూస్‌క్లిక్ హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిని జనవరిలో కోర్టు అనుమతించింది. ఈ కేసులో అరెస్టయిన చక్రవర్తి తన వద్ద మెటీరియల్ సమాచారం ఉందని, ఈ విషయాన్ని దర్యాప్తు చేస్తున్న దిల్లీ పోలీసులకు వెల్లడించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్న అతని దరఖాస్తుపై న్యాయమూర్తి అనుమతించారు. గత ఏడాది అక్టోబరు 3న చక్రవర్తి, పుర్కాయస్థను దిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం అరెస్ట్ చేసింది. ప్రస్తుతం వారు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. 'భారత సార్వభౌమాధికారానికి భంగం కలిగించడానికి', దేశంపై అసంతృప్తిని కలిగించడానికి చైనా నుంచి పెద్ద మొత్తంలో న్యూస్‌పోర్టల్‌కు నిధులు వచ్చాయని ఆరోపణలు ఉన్నాయి' అని ఎఫ్ఐఆర్ పేర్కొంది.

బీజేపీ మళ్లీ వస్తే రాజ్యాంగం రద్దు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

భింద్ (మధ్య ప్రదేశ్) : కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే పేదలు, దళితులు, ఎస్టీలు, ఓబీసీలకు హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తుందని, రద్దు చేస్తుందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. మధ్య ప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో జరిగిన ర్యాలీలో గాంధీ, రాజ్యాంగం (పుస్తకం) ప్రతిని పట్టుకుని ప్రసంగిస్తూ, ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కాదని, రెండు సిద్ధాంతాల మధ్య పోరు అని తెలిపారు. రాజ్యాంగం వల్ల పేదలు, ఎస్టీలు, ఓబీసీలు అనేక హక్కులు పొందారని, దీని వల్ల ప్రజలకు ఎంజీఎన్ఆర్ఈజీఏ, భూమి హక్కులు, రిజర్వేషన్లు, ఇతరత్రా హక్కులు కల్పించారని, బీజేపీ అధికారంలోకి వస్తే ఈ రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందన్నారు. 'ప్రధాని, అమిత్ షా (కేంద్ర హోం మంత్రి), వారి ఎంపీలు తాము ఎన్నికయితే ఈ (రాజ్యాంగం) పుస్తకాన్ని ముక్కలు చేసి విసిరేస్తామని తేల్చి చెబుతున్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని, 20- 25 మంది బిలియనీర్లు దేశాన్ని నడపాలని బీజేపీ కోరుకుంటోంది' అని వయనాడ్ ఎంపీ తెలిపారు. రిజర్వేషన్ల విషయంలోనూ బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. పాలకవర్గం రిజర్వేషన్లకు వ్యతిరేకం కాకపోతే, పీఎస్‌యూలు, రైల్వేలు, ఇతర రంగాలను ఎందుకు ప్రైవేటీకరించారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, మహాలక్ష్మి యోజన ద్వారా కోట్లాది మంది మహిళలను 'లఖపతి' గా మారుస్తామని కూడా గాంధీ చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం మహిళల ఖాతాల్లోకి లక్ష రూపాయలను (నెలకు రూ.8,500) బదిలీ చేసి వారిని 'లఖపతి'గా మార్చుతుందన్నారు. నరేంద్ర మోదీ 22-25 మంది పారిశ్రామికవేత్తలను బిలియనీర్లుగా మార్చగలిగితే, కాంగ్రెస్ కోట్లాది మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తుందని గాంధీ అన్నారు. భింద్ లోక్‌సభ (ఎస్సీ-రిజర్వ్‌డ్) స్థానం నుంచి బీజేపీ సిట్టింగ్ ఎంపీ సంధ్యా రాయ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫూల్ సింగ్ బరయ్యను పోటీకి దింపింది.

అతడికి మేజర్ శస్త్రచికిత్స జరిగింది

రాఘవ్ చద్దా అదృశ్యంపై దిల్లీ మంత్రి వివరణ

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా గత కొంతకాలంగా భారత్‌లో కనిపించడం లేదు. ముఖ్యంగా దిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత కూడా ఆయన ప్రత్యక్షం కాలేదు. దీంతో యంగ్ లీడర్ అదృశ్యంపై మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపించాయి. కేసుల భయంతో ఆయన విదేశాలకు పారిపోయారంటూ పుకార్లు వ్యాపించాయి. అయితే, ఆ పుకార్లకు దిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తాజాగా ఫులుస్టాప్ పెట్టారు. కంటి శస్త్రచికిత్స కోసం రాఘవ్ చద్దా యూకే వెళ్లినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం మీడియాతో సౌరభ్ భరద్వాజ్ మాట్లాడారు. 'రాఘవ్ గత కొంతకాలంగా కంటి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. చికిత్స కోసం యూకే వెళ్లారు. అక్కడ ఆయనకు మేజర్ కంటి శస్త్ర చికిత్స జరిగింది. ఇది చాలా తీవ్రమైనది. సకాలంలో చికిత్స అందించకపోతే అంధత్వం వచ్చే ప్రమాదం ఉంది. అతడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. కోలుకున్న వెంటనే తిరిగి భారత్ వచ్చి పార్టీ ప్రచారంలో పాల్గొంటారు' అని భరద్వాజ్ తెలిపారు.

కేజ్రీవాల్ బాగానే ఉన్నారు: మాన్

న్యూఢిల్లీ: దిల్లీ మద్యం కేసులో అరెస్టయ్యి ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మంగళవారం కలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేజ్రీవాల్ ఆరోగ్యంగానే ఉన్నారని... ఇన్సులిన్ తీసుకుంటున్నారని తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం బాగా చేయాలని... ప్రజలకు తన గురించి ఆందోళన చెందొద్దని చెప్పాలని కోరారన్నారు. పంజాబ్‌లో గోదుమల ఉత్పత్తి, విద్యుత్ సరఫరా తదితర అంశాల గురించి కేజ్రీవాల్ తనను అడిగారన్నారు. అలాగే, పంజాబ్ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన 158 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ క్లియర్ చేశారని చెప్పడంతో ఆ మాట విని ఎంతగానో సంతోషించారని చెప్పారు. ఇటీవల తన గుజరాత్ పర్యటన గురించి కూడా చెప్పానన్నారు. ప్రజలు ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కేజ్రీవాల్ ఈసందర్భంగా ప్రజలకు సందేశం ఇచ్చారన్నారు. కేజ్రీవాల్ అరెస్టయి జైలుకు వెళ్లాక సీఎం భగవంత్ మాన్ ఆయన్ను కలవడం ఇది రెండోసారి.

విడాకులకూ 'బ్యాండు మేళం' సందడి!

కుమార్తెకు సాదర స్వాగతం పలికిన తండ్రి

కాన్పూర్ (ఉత్తర ప్రదేశ్) : విడాకుల్లోనూ సమాజానికి ఒక సందేశం అందించేందుకు ప్రయత్నించాడు ఒక తండ్రి. తన కుమార్తె పెళ్లి పెటాకులైనా సందడి చేయడంలో ఏమాత్రం తగ్గలేదు. తన కూతురిలో ఆత్మస్థైర్యం పెంచేందుకు వినూత్న ఆలోచన చేశాడు యూపీ వాసి. పెళ్లి తర్వాత అందరి తండ్రులు తమ కూతుళ్లను ఎంతో ఆర్భాటంగా మెట్టినింటికి పంపిస్తారు. కానీ ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఒక తండ్రి విడాకులు తీసుకున్న తర్వాత తన కుమార్తెను బ్యాండు మేళం సందడితో ఇంటికి తీసుకువచ్చాడు. 'మేము ఆమెను పెళ్లి తర్వాత పంపినట్లే మేము ఆమెను తిరిగి తీసుకువచ్చాం. ఆమె తిరిగి కొత్త జీవితం ప్రారంభించాలని కోరుకుంటున్నాం' అని బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తున్న ఆమె తండ్రి అనిల్ కుమార్ చెప్పారు. న్యూదిల్లీలోని పాలం విమానాశ్రయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న అనిల్ కుమార్తె ఉర్వి (36) కి 2016లో కంప్యూటర్ ఇంజనీర్‌తో వివాహం జరిగింది. ఈ దంపతులకు దిల్లీలో ఒక కుమార్తె ఉంది. ఉర్విని అత్తమామలు కట్నం కోసం వేధిస్తున్నారని ఆరోపిస్తూ విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఫిబ్రవరి 28న దంపతులకు విడాకులు మంజూరు చేసింది. 'నేను ఎనిమిదేళ్ల హింసలు, దెబ్బలు, అవహేళనలను భరించిన తర్వాత సంబంధాన్ని కాపాడుకోవడానికి చాలా ప్రయత్నించాను. కానీ చివరికి అది విచ్ఛిన్నమైంది' అని ఆమె చెప్పింది. 'ఆమెను తిరిగి ఇంటికి తీసుకువచ్చేటప్పుడు సమాజానికి సానుకూల సందేశం పంపాలని 'బ్యాండ్ బాజా' ఏర్పాట్లు చేశాను. ప్రజలు తమ కుమార్తెలకు వివాహం చేసుకున్న తర్వాత వారిని పట్టించుకోకుండా వారిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు' అని అనిల్ కుమార్ చెప్పారు. ఉర్వి తల్లి కుసుమలత మాట్లాడుతూ 'నేను నా కూతురు, మనవరాలితో కలిసి ఉండటానికి ఎదురుచూస్తున్నాను. ఇది గొప్ప అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. 'మొదట్లో, ఉర్విని రెండో పెళ్లి చేసుకుంటుందని అనుకున్నాం. కానీ ఆమె తండ్రి ఉద్దేశాన్ని అర్థం చేసుకున్నప్పుడు అది ఒక అనుభూతిని కలిగిస్తుంది' అని పొరుగు నివాసి ఇంద్రభన్ సింగ్ చెప్పారు. ఇంతలో, ఉర్వి తన తల్లిదండ్రుల ఉద్దేశాన్ని మెచ్చుకుంది. కొత్త జీవితాన్ని ప్రారంభించే ముందు కొంత విరామం తీసుకుంటానని చెప్పింది.

అసహనంతోనే ఫేక్ వీడియోలు

కాంగ్రెస్‌పై అమిత్ షా మండిపాటు

న్యూఢిల్లీ: రిజర్వేషన్ల రద్దుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. తాజాగా అమిత్ షా దీనిపై స్పందిస్తూ... కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీ అసహనంతోనే ఫేక్ వీడియోలు తయారు చేస్తోందని మండిపడ్డారు. తమ మాటలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చేందుకు బీజేపీ వ్యతిరేకమని మరోసారి స్పష్టం చేశారు. '400 సీట్లు దక్కించుకున్న తర్వాత బీజేపీ రిజర్వేషన్లను రద్దుచేస్తుందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఆ మాటలన్నీ నిరాధారమైనవి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు మా పార్టీ మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేస్తున్నాను. నాతోపాటు మా పార్టీకి చెందిన ఇతర నేతల నకిలీ వీడియోలను ప్రచారం చేసే స్థాయికి వారి అసహనం పెరిగిపోయింది. ముఖ్యమంత్రులు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఇతరులు ఈ ఫేక్ వీడియోను వ్యాప్తి చేశారు. ప్రస్తుతం ఆ పార్టీకి చెందిన ఒక ప్రముఖనేత క్రిమినల్ నేరాన్ని ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ వారి అసంతృప్తిని వెల్లడిచేస్తున్నాయి. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాజకీయాలను మరింత దిగజార్చేపనిలో ఉన్నారు. ఈ తరహా దృశ్యాలను ప్రచారం చేసి, ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేయడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఏ ప్రధాన పార్టీ కూడా ఇలాంటి చర్యలకు పాల్పడకూడదు' అని అమిత్ షా అన్నారు. కర్నాటకలో తమ మిత్రపక్షం జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించినవిగా చెబుతున్న అభ్యంతరకర వీడియోలపై స్పందించారు. 'దేశంలో మేం మాతృ శక్తికి అండగా నిలుస్తామన్నది స్పష్టం. అక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు, అది ఆ రాష్ట్ర శాంతిభద్రతల అంశం. మేం విచారణకు అనుకూలంగా ఉన్నాం. ఆ ఘటనపై చర్యలు తీసుకుంటామని జేడీఎస్ కూడా ఇప్పటికే ప్రకటించింది' అని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాయబరేలీ నియోజకవర్గాల్లో రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ పోటీ గురించి అడగ్గా..'వారు బరిలో ఉంటారా లేదా అనేది తెలీదు. అయితే వారిలో గందరగోళం చూస్తుంటే ఆత్మవిశ్వాసం లేనట్లు కనిపిస్తోంది. ఆ పార్టీ అగ్రనేతలు సొంత సీట్లు వదిలిపారిపోయిన పరిస్థితి ఉంది' అని తెలిపారు.

కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

రెండు రోజుల్లో రెండో ఘటన

జైపూర్: ఉన్నత చదువులు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్ రాష్ట్రంలోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఒత్తిడి కారణంగా విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా మరో విద్యార్థి తనువు చాలించాడు. రాజస్థాన్ రాష్ట్రానికే చెందిన భరత్ అనే విద్యార్థి మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)కి సన్నద్ధమవుతున్నాడు. కోటాకు 400 కిలోమీటర్ల దూరంలోని ధోల్‌పూర్‌కు చెందిన భరత్... కోటాలోని ఓ హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో అతడు తాజాగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. కోచింగ్ హబ్ అయిన కోటాలో ఒత్తిడి వల్ల విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడటం కలకలం రేపుతోంది. తాజా ఘటనతో కలిసి రెండు రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన. కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకూ ఇది పదో ఘటన కావడం గమనార్హం. ఇక గతేడాది ఏకంగా 30 మంది వరకు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. హర్యానా రోహ్‌తక్‌కు చెందిన సుమిత్ అనే 20 ఏళ్ల నీట్ విద్యార్థి కూడా ఆదివారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. నీట్ పరీక్షకు సన్నద్ధమవుతున్న సుమిత్... గత ఏడాది కాలంగా కోటాలోని కున్హాడి ల్యాండ్‌మార్క్ సిటీలో ఉన్న ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ సెంటర్‌లో కోచింగ్ తరగతులకు హాజరవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అతను తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మరోవైపు విద్యార్థుల వరుస ఆత్మహత్య ఘటనలతో అప్రమత్తమైన రాజస్థాన్ ప్రభుత్వం ఇటీవలే నివారణ చర్యలు చేపట్టింది. విద్యార్థులు ఎక్కువగా ఫ్యాన్లకు ఉరివేసుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించింది. ఇందులో భాగంగానే ఇటీవలే కోటాలోని అన్ని హాస్టళ్లు , పెయింగ్ గెస్ట్ వసతుల్లో స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను అధికారులు ఏర్పాటు చేశారు. లోడ్‌ను గుర్తించిన వెంటనే అన్ కాయిల్ అయ్యేలా ఈ ఫ్యాన్లను తయారు చేశారు. లోడ్ అవ్వగానే సీలింగ్ నుంచి ఫ్యాన్ కిందకు జారిపోతుంది. ఈ చర్యలతో కాస్తమేర ఆత్మహత్య ఘటనలను తగ్గించొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు ఆగకపోవడం తీవ్ర కలవరానికి గురిచేస్తోంది.

నవీన్ పట్నాయక్ నామినేషన్ దాఖలు

భువనేశ్వర్: గంజాం జిల్లాలోని హింజిలి అసెంబ్లీ స్థానం నుంచి మంగళవారం ఒడిశా సీఎం, బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. కంతబంజి, హింజిలి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పట్నాయక్ ఎన్నికల బరిలో నిలిచారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు మే 13 నుంచి జూన్ ఒకటి వరకూ ఒడిశా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఒడిశాలో ప్రధానంగా బీజేపీ, బీజేడీ మధ్య పోటీ నెలకొనగా కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ కొంతమేర ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక బీజేపీ, బీజేడీ కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ఆరోపించారు. ఈ రెండు పార్టీలు వివాహ బంధంతో ఒక్కటయ్యాయని పైకి మాత్రం ఒకరిపై ఒకరు పోటీ చేస్తున్నట్టు నటిస్తాయని ఎద్దేవా చేశారు. మోదీ, నవీన్ పట్నాయక్ ఇద్దరూ కొద్ది మంది సంపన్నుల బాగు కోసం పనిచేస్తారని పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్ ఎన్నికలు

ఆసక్తికరం



అనంతనాగ్-రాజౌరీపైనే అందరి దృష్టి

ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ - 7న పోలింగ్

జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. 2019, ఆగస్టు 5న 370 అధికరణ రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో మొదటిసారి లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం ఐదు దశల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఫలితాలు జూన్ 4న వెలువడుతాయి. బారాముల్లా, శ్రీనగర్, అనంతనాగ్-రాజౌరీ, ఉధంపూర్, జమ్మూ లోక్‌సభ స్థానాలకు దశలవారీగా ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి దశ అనగా ఏప్రిల్ 19న ఉధంపూర్, రెండవ దశ అనగా ఏప్రిల్ 26న జమ్మూలో పోలింగ్ జరిగింది. తాజాగా మూడవ దశలో భాగంగా అనంతనాగ్-రాజౌరీ స్థానానికి మే 7న ఎన్నికలు జరగబోతున్నాయి. ప్రధాన పార్టీల మధ్య రసవత్తర పోరు సాగబోతోంది. ఆ తర్వాత దశలో శ్రీనగర్ లోక్‌సభ స్థానానికి పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల దృష్ట్యా కేంద్ర పాలిత ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 635 సీఏపీఎఫ్ కంపెనీలను జమ్మూకశ్మీర్, లడాఖ్‌లో మోహరించారు. ఈవీఎంలు/స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతతో పాటు కౌంటింగ్ కేంద్రాల వద్ద 36 కంపెనీలు విధులు నిర్వర్తిస్తున్నాయి.

తొలి రెండు దశల్లో ఒకే ఒక్క మహిళ పోటీ

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తొలి రెండు దశలు ముగిశాయి. జమ్మూకశ్మీర్‌లో 34 మంది పోటీ చేయగా వీరిలో ఒక్క మహిళ మాత్రమే ఉండటం అక్కడి లింగ అసమానతలకు అద్దం పట్టింది. జాతీయ స్థాయిలో కేవలం ఎనిమిది శాతం మంది మహిళా అభ్యర్థులు ఉండగా జమ్మూకశ్మీర్‌లో అది 2.9శాతానికి పడిపోయింది. ఉధంపూర్-దోడా లోక్‌సభ స్థానం నుంచి 12 మంది పోటీ చేయగా ఏ పార్టీ కూడా మహిళలకు టికెట్ ఇవ్వలేదు. ఓటర్లలో మహిళలు 50శాతం మేర ఉన్నారు. జమ్మూ స్థానంలో 22 మంది పోటీ చేస్తే అందులో ఏకైక మహిళా అభ్యర్థిగా నేషనల్ అవామీ యునైటెడ్ పార్టీ నేత శిఖా బంద్రాల్ నిలిచారు. త్వరలో ఎన్నికలు జరగబోయే అనంతనాగ్-రాజౌరీ స్థానం నుంచి మొత్తం 22 మంది అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ స్థానం నుంచి పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, స్వతంత్ర అభ్యర్థి గుల్షన్ అక్కర్ మాత్రమే మహిళా అభ్యర్థులుగా ఉన్నారు. 2019 ఎన్నికలలో జమ్మూకశ్మీర్ రాష్ట్రంగా ఉన్నప్పటికీ ముగ్గురు మహిళలు మెహబూబా ముఫ్తీ, రిద్వానా సనమ్ (అనంతనాగ్ స్వతంత్ర అభ్యర్థి), మీనాక్షి (శివసేన-ఉధంపూర్) మాత్రమే పోటీ చేశారు. ఆ ఎన్నికల తర్వాత సనమ్, మీనాక్షి రాజకీయాల నుంచి కనుమరుగయ్యారు.

అనంతనాగ్ ప్రత్యేక స్థానం

కశ్మీర్ లోయ, జమ్మూ ప్రాంతాలతో కూడుకున్న అనంతనాగ్-రాజౌరీ స్థానానికి ప్రత్యేక ఏర్పడింది. ఇక్కడి ఎన్నిక ఆసక్తికరంగా మారింది. పునర్విభజన తర్వాత రాజౌరీ, పూంచ్ ప్రాంతాలు అనంతనాగ్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చాయి. 2022లో ఏర్పడిన అనంతనాగ్- రాజౌరీ నియోజకవర్గంలో అనంతనాగ్, షోపియాన్, కుల్గామ్ జిల్లాలు (దక్షిణ కశ్మీర్), జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ, పూంచ్ ఉన్నాయి. బీజేపీ తన సీట్లను పెంచుకోవాలని భావిస్తుండటంతో ఈ స్థానంపై దృష్టిని కేంద్రీకరించింది. పునర్విభజన ప్రక్రియలో ఈ నియోజకవర్గం హద్దులు మారాయి. ప్రస్తుతం ఈ స్థానానికి నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు హస్నైన్ మసూదీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గులాం నబీ మీదర్, పీడీపీ అభ్యర్థి మెహబూబా ముఫ్తీపై మసూదీ గెలుపొందారు. తాజా ఎన్నికల్లో ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్న ప్రముఖ అభ్యర్థుల్లో మియాన్ అల్తాఫ్ లర్వీ (ఎన్‌సీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), అర్షీద్ అహ్మద్ లోనె (జమ్మూకశ్మీర్ నేషనల్ ప్యాంథర్స్ పార్టీ), జాఫర్ ఇక్బాల్ మన్హాస్ (అప్నీ పార్టీ), మహమ్మద్ సలీం పారే (డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ) ఉన్నారు.

అనంతనాగ్-రాజౌరీ... పేద-ధనిక అభ్యర్థులు వీరే

అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న 20 మంది అభ్యర్థుల్లో ఎటువంటి ఆస్తులు లేని పేద అభ్యర్థిగా జమ్మూకశ్మీర్ నేషనల్ ప్యాంథర్స్ పార్టీ (జేకేఎన్‌పీపీ) తరపున బరిలో నిలిచిన అర్షీద్ అహ్మద్ లోనె (28) నిలిచారు. ప్రచారం కోసం డబ్బులు లేక తన తండ్రి వద్ద అర్షీద్ అప్పు చేశారు. ఎటువంటి ఆదాయం, ఆస్తులు లేనందున ఆదాయపు పన్ను చెల్లించలేదని ఐదేళ్ల రికార్డులు చెబుతున్నాయి. కారు కొనుక్కునేందుకు రూ.2.60లక్షల అప్పు చేసినట్లు అఫిడవిట్ పేర్కొంది. అర్షీద్ తండ్రి గులామ్ మహమ్మద్ లోనె యాపిల్ సాగుదారుడు. అర ఎకరం పొలంలో యాపిల్ సాగు చేస్తారు. ఇదే వారికి జీవనోపాధి. దీనిపైనే వీరి కుటుంబం ఆధారపడుతోంది.

ఇక ధనిక అభ్యర్థుల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తరపున పోటీ చేస్తున్న అల్తాఫ్ అహ్మద్‌ది అగ్రస్థానం. ఆయనకు రూ.21 కోట్ల ఆస్తి ఉన్నది. కోటి కంటే తక్కువ ఆస్తిగల ప్రముఖ అభ్యర్థుల్లో మెహబూబా ముఫ్తీ ఒక్కరే ఉన్నారు. ఆమె తన మొత్తం ఆస్తి విలువను రూ.75లక్షలుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

రాజకీయాల్లోకి యువత

ప్రధాన స్రవంతిలోకి రావడమే శాంతికి మార్గమన్నది తన నమ్మకంగా కొత్తగా రాజకీయాల్లో అడుగు పెట్టిన 33 ఏళ్ల సజాద్ అహ్మద్ దార్ అన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా అనంతనాగ్-రాజౌరీ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈయన కుల్గామ్ వాసి. కశ్మీర్‌లోని రాజకీయ పార్టీలకు గట్టి పోటీ ఇవ్వగలనన్న ధీమాతో ఉన్నారు. తనకు ఆదాయం, ఆస్తులు లేవని, 2014లో తనపై క్రిమినల్ కేసు ఒకటి నమోదైందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 'ప్రధాన పార్టీలు కొత్త వారికి అవకాశమివ్వవు కాబట్టే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నా' అని దార్ తెలిపారు. కాగా, ఉద్యోగాలొస్తే కశ్మీర్‌లో రాళ్ల రువ్వడాలు తగ్గుతాయని మరొక యువ నేత అభిప్రాయపడ్డారు. తన వద్ద డబ్బు లేనప్పటికీ అనంతనాగ్-రాజౌరీ ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఎన్‌పీపీ తరపున పోటీ చేస్తున్నట్లు అభ్యర్థి అర్షీద్ అహ్మద్ లోనె వెల్లడించారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగం ఉన్నదని, అభివృద్ధి లేదని చెప్పారు. దేశంలో ప్రతి ఏటా వేలల్లో ప్రాజెక్టులు మొదలవుతాయి వాటిలో కనీసం పది మా ప్రాంతానికి వస్తే ఎంతో మేలు జరుగుతుందని ఆయనన్నారు.

మోదీయే విద్వేష గురువు

ఓటమి భయంతో మతాల మధ్య చిచ్చు పెడుతూ విద్వేష గురువుగా మారిన మోదీని ఉద్దేశించి గోవాకు చెందిన యువతి విడుదల చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతోంది. ఆ యువతి ప్రత్యక్షంగా ప్రధాని మోదీని, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘ్ పరివార్, బీజేపీ వ్యవహార శైలిని సూటిగా నిలదీస్తూ చేసిన ఆ ప్రసంగం జనం మెదళ్లను తీవ్రంగా కదిలిస్తోంది. హిందూ సమాజానికే చెందిన సదరు మహిళ చేసిన ప్రసంగ పాఠం ఇలావుంది.

మోదీ జీ...

దక్షిణ గోవాలో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మీ పార్టీకి చెందిన నేతలు ఆరోపిస్తున్నారు. మీరు చేస్తున్న దేమిటో గుర్తు చేస్తున్నాను. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్‌లో పర్యటించిన మీరు భారతీయ ముస్లిం సమాజంపై చేసిన వ్యాఖ్యలు తీవ్రమైనవి. ముస్లింలు సహా ఇతర మైనారిటీలు కల్తీలంటూ మీరు దారుణమైన, అనుచితమైన వ్యాఖ్యలు చేశారు. భారతీయ ముస్లింలను అవమానించడం, దూషించడం మీకు ఎప్పటి నుంచో అలవాటైన పనే.

కేవలం ముస్లింనే కాదు క్రిస్టియన్‌ల విషయంలోనే ఇదే తీరులో వ్యవహరిస్తున్నారు. మీ అనుబంధ శక్తులు క్రిష్టియన్ పాఠశాలలకు వెళ్లి అక్కడుంటున్న క్రైస్తవ సన్యాసినులు (నన్) లను వేధింపులకు గురి చేశారు. జీసస్ విగ్రహాలను ధ్వంసం చేశారు. మణిపూర్ ఇప్పటికీ మండుతోంది. ఆ రాష్ట్రంలో 300లకు పైగా చర్చిలను తగులబెట్టారు. గోవా విషయంలో మీ పార్టీ నేతలు, సంఘ్ పరివార్ శక్తులు చర్చిలను, విగ్రహాలను, ఆరాధ్యనీయ చిహ్నాలను ధ్వంసం చేశారు. మతతత్వ రక్కసిని పెంచి పోషించారు. మైనారిటీలపై దాడులు, నేరాలు తీవ్రమయ్యాయి. మీరు చేస్తున్న వ్యాఖ్యలు, ప్రసంగాలు అన్ని మైనారిటీలకు వ్యతిరేకంగానే ఉంటున్నాయి. ఈ విధంగా మీరు భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా నేరపూరిత ప్రవృత్తిని పెంచి పోషించారు. కానీ వీటన్నింటినీ మరుగుపరిచేలా భారత రాజ్యాంగాన్ని మేమే కాపాడుతున్నామంటూ గొప్పలు చెబుతారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం పట్ల ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారు. కానీ మీరు, మీ పార్టీ నేతలు రాజ్యాంగం విషయంలో ఘోరమైన నేరానికి పాల్పడుతున్నారు. ప్రత్యక్ష్యంగా కేంద్ర మంత్రులే రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. కొందరు మంత్రులు తాము హిందూ రాష్ట్ర కోసం కృషి చేస్తున్నట్టు బాహాటంగా అంటున్నారు. హిందూ రాష్ట్ర అంటే ఏమిటి...? హిందూ రాష్ట్ర అనేది పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమైన భావజాలం. రాజ్యాంగాన్ని రూపుమాపడమే కదా. మీ మంత్రి మండలిలోని సభ్యులు, మీ పార్టీకి చెందిన ఎంపీలు మేము రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటిస్తూనే ఉన్నారు. ఇప్పటికే అనేక సవరణలు చేసి రాజ్యాంగాన్ని బలహీనపరిచారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మైనారిటీలను నిత్యం ఆడిపోసుకుంటారు. ఇప్పుడు చెప్పండి ఎవరు నేర పూరిత ప్రవర్తన కలవారో...?

హిందూ సమాజానికి చెందిన మహిళగా నేను భారత దేశంలో నా చుట్టూ ఉన్న సమాజంతో, కుటుంబంతో చాలా సంతోషంగా ఉంటున్నాను. ప్రత్యేకంగా మైనారిటీలతోనూ సంతోషంగా కలసి జీవిస్తున్నాను. నేను హిందువునే అయినా క్రిస్టియన్ స్నేహితులతో కలసి చర్చికి వెళతాను, వారితో కలసి ప్రార్థన చేస్తాను. ముస్లింలతో కలసి ఈద్ సంబరాల్లోనూ భాగస్వామ్యం అవుతాను. అనునిత్యం అన్ని మతాల వారితో భుజం భుజం కలిపి నడుస్తాను. వారంతా నాతో ఉంటున్నారు. నేను వారితో ఉంటున్నాను. ఇది రాజ్యాంగం సూచించిన అసలైన భారతీయత. రాజ్యాంగం అందించిన వెలుగు ద్వారానే ఇది సాధ్యమైంది.

మీరు భారత రాజ్యాంగాన్ని చదవండి. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందులోని కీలక అంశాలు. ఇవేవీ మీకు ఇష్టం ఉన్నట్టు కనిపించడం లేదని భావిస్తున్నాను. నేను హిందువుగా భావిస్తున్నదేమిటంటే మీలో ఎక్కడా నైతికత ఉన్నట్టు లేదు. ప్రతిసారి రాముని పేరు వాడుతారు కదా. రాముడు మర్యాద పురుషోత్తముడు. మరి ఆయనలోని భావజాలం మీలో ఎక్కడుంది. రాముని చరిత్ర నుంచి అందించే ఆదర్శం, నైతికత విలువలు వంటి సుగుణాలు మీలో లేనే లేవు. మీరు రాముని పేరుతో ఏమి చేసినా, మాట్లాడినా కేవలం రాజకీయం కోసమే అనేది సుస్పష్టం. రాజకీయ లబ్ధి, అధికారమే పరమావధిగా అన్ని అడ్డదారులు తొక్కుతున్నారు. ఇది కాదు భారతీయత అంటే. భారతీయత గురించి మాట్లాడే హక్కు మీకు లేదు. ఇప్పటికే అధికారం అడ్డుపెట్టుకుని వివిధ రాజ్యాంగ సంస్థలను అనుకూలంగా మలచుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్‌ను కూడా అలాగే వాడుకుంటున్నారు. మీరు చేస్తున్న విద్వేష పూరిత ప్రసంగాలపై ఈసీ చర్యలు తీసుకోవడం లేదు. మీరు చేస్తున్న మతతత్వ వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకం కాదా, ఇది కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది.

మీరే కాదు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా చాలా మంది మంత్రులు పదే పదే మతం కార్డును రాజకీయాల్లోకి తెస్తున్నారు. ఇది ఏ విధంగానూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గౌరవించినట్టు. ఇది నైతికత అనిపించుకుంటుందా...అని నిలదీశారు. ఇదేనా భారత రాజ్యాంగాన్ని , అంబేద్కర్‌ను గౌరవించే తీరు. అంబేద్కర్ పేరును పలకాలంటే ముందు మీరు రాజ్యాంగాన్ని చదవండి. ఈ దేశంలో ప్రతి పౌరుడు సమానమే. అన్ని మతాలను అవలంబించే వారి హక్కులూ సమానమే అని రాజ్యాంగంలోనే ఉంది. నాతో పాటు కోట్ల మంది హిందువులు రాజ్యాంగానికి బద్ధులుగానే ఉంటున్నాం. ఇండియన్స్ అనే భావనకు రాజ్యాంగమే ఆధారం. అయితే మీరు మాత్రం రాజ్యాంగానికి వ్యతిరేకంగానే ఉన్నారు. కానీ మేము భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని అనకుంటున్నాం. రాజ్యాంగం విషయంలో మీకు ఏ హక్కులు లేవు. అంబేద్కర్ పేరును ఉచ్చరించే హక్కే మీకు లేదు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పని చేసేవారెవరికీ ఈ హక్కు ఉండదు.

మోదీజీ ఇప్పటికైనా మీ మైండ్ గేమ్‌లు ఆపండి. మీ ముసుగులు తొలగిపోయాయి. మీ మోసపూరిత వ్యవహారాల్ని జనం గ్రహించారు. ఎవ్వరూ దేశ భవిష్యత్తుపట్ల ఆశలు వదులు కోవద్దు. సంఘ్ పరివార్ చేస్తున్న మతతత్వ విభజనకు, సామాజిక విభజనకు మేమంతా వ్యతిరేకం. దేశంలోని మైనారిటీలు ఎవ్వరూ అధైర్యపడవద్దు. మేము మీతో ఉన్నాం. అందరం కల్సి రాజ్యాంగాన్ని రక్షించుకుందాం. ●

(సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో ఆధారంగా...)

నాలుగు రాష్ట్రాల్లో పోటీకి కమలం దూరం

సార్వత్రిక ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని తహతహలాడుతున్న కాషాయ పార్టీ బీజేపీ ఈ ఎన్నికలలో నాలుగు రాష్ట్రాలలో అసలు పోటీనే చేయడంలేదు. బీజేపీ పోటీచేయని రాష్ట్రాలలో లక్షద్వీప్, మేఘాలయ, నాగాలాండ్, కశ్మీర్ ఉన్నాయి. అక్కడి 7 సీట్లు మినహాయించి మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కొన్ని నియోజకవర్గాలలో అయినా బీజేపీ పోటీచేస్తోంది. దేశవ్యాప్తంగా మొత్తం 443 స్థానాల్లో ఆ పార్టీ పోటీపడుతోంది. ఆంధ్రప్రదేశ్, అసోం, బీహార్, ఝార్ఖండ్, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, మణిపూర్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్డీయే మిత్రపక్షాలతో కలిసి సీట్లు సర్దుబాటు చేసుకొని పోటీలోకి దిగింది. మిగతాచోట్ల ఒంటరిగానే పోటీపడుతోంది. 1996లో 471 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ పోటీచేసింది. ఆ తర్వాత ఇన్ని నియోజకవర్గాల్లో కాషాయపార్టీ పోటీ చేయడం ఇదే ప్రథమం.



370 అధికరణాన్ని రద్దు చేశాక కశ్మీర్ ప్రాంతంలో జరుగుతున్న తొలి ఎన్నికలకు బీజేపీ దూరంగా ఉంది. అక్కడున్న మూడు సీట్లలో అభ్యర్థులను పోటీకి దింపలేదు. ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోలేదు. ఈ కేంద్రపాలిత ప్రాంతంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఆర్టికల్ 370 రద్దుపై కశ్మీర్ లోయలోని ప్రజల్లో ఉన్న వ్యతిరేకత లోక్‌సభ ఎన్నికల్లో కనిపిస్తే ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపైనా పడుతుందని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. తాము ఇక్కడ దేశభక్త పార్టీలకు మద్దతిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా ప్రకటించారు. జమ్మూలోని రెండు స్థానాల నుంచి మాత్రం బీజేపీ పోటీలో ఉంది. అనంత్‌నాగ్-రాజౌరీ, శ్రీనగర్, బారాముల్లా స్థానాల నుంచి కాంగ్రెస్ కూడా పోటీచేయడం లేదు. పొత్తులో భాగంగా వాటిని నేషనల్ కాన్ఫరెన్స్‌కు కేటాయించింది. మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీ అక్కడ ఒంటరిగా పోటీచేస్తోంది.

మేఘాలయలోని రెండు సీట్లను ఎన్డీయే మిత్రపక్షం నేషనల్ పీపుల్స్ పార్టీకి, నాగాలాండ్‌లోని ఒక్క సీటును నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి, లక్షద్వీప్‌లోని ఒక సీటును అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి బీజేపీ కేటాయించింది. ఇవి మినహాయించి మిగిలిన అన్ని రాష్ట్రాల్లో ఎక్కడోచోట కమలం పార్టీ రంగంలోకి దిగింది. మొత్తంగా ఈ ఎన్నికల్లో 443 స్థానాల్లో పోటీచేస్తున్న కాషాయ పార్టీ ఇప్పటివరకు 435 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా 8 స్థానాలకు ప్రకటించాల్సి ఉంది. ఇందులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయబరేలి, కైసర్‌గంజ్ స్థానాలున్నాయి. రాయబరేలి నుంచి కాంగ్రెస్ ప్రకటించే అభ్యర్థిని చూశాక బలమైన ప్రత్యర్థిని దించాలని బీజేపీ భావిస్తోంది.

కైసర్‌గంజ్ నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న వివాదాస్పద నేత, భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను కొనసాగించాలా? మరో అభ్యర్థిని రంగంలోకి దించాలా? అని ఆ పార్టీ తలబాదుకుంటోంది. బ్రిజ్‌భూషణ్‌పై మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

మొదటి అంధ పార్లమెంట్ సభ్యుడు



రష్యా సోషలిస్ట్ విప్లవం జరిగిన 1917 నవంబర్ 7న ఢాకాలో జన్మించిన సాధన్ గుప్తా మన పార్లమెంటులో మొట్టమొదటి అంధ సభ్యుడు. వృత్తి రీత్యా ఆయన న్యాయవాది. స్వాతంత్ర్యానికి పూర్వం ఆయనకు మేటి న్యాయవాది అన్న ఖ్యాతి ఉండేది. బ్రిటీష్ చక్రవర్తికి-శివనాథ్ బెనర్జీకి మధ్య జరిగిన వ్యాజ్యంలో ఆయన వాదనలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడే ఆయనకు మశూచి సోకి చూపు కోల్పోయారు. కోల్‌కతాలోని అంధుల పాఠశాలలో చదువుకున్నారు. మెట్రిక్యులేషన్ పరీక్షలో మొదటి పది స్థానాలలో నిలిచారు. ప్రెసిడెన్సీ కళాశాలలో మొదట ఎంఏ అర్థ శాస్త్రం పూర్తి చేసి అదే విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణులయ్యారు. కళాశాల విద్య అభ్యసిస్తున్నప్పుడే వామపక్ష విద్యార్థి ఉద్యమం వేపు ఆకర్షితులయ్యారు. బెంగాల్ ప్రావిన్షియల్ విద్యార్థి సమాఖ్యకు అధ్యక్షుడయ్యారు. 1939లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. సీపీఐ చీలినప్పుడు ఆయన సీపీఎం లో చేరారు. మొదటి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. 1962 వరకు లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు. మూడు దఫాలు సాధన్ గుప్తా కోల్‌కతా ఆగ్నేయ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించారు. అంధుల జాతీయ సమాఖ్యకు తొలి అధ్యక్షులయ్యారు. ఆ తరవాత అంతర్జాతీయ అందుల సమాఖ్య భారత విభాగానికి అధ్యక్షులయ్యారు. బెంగాల్ అడ్వొకేట్ జనరల్‌గా కూడా పని చేశారు. ఆయన తండ్రి జోగేశ్ చంద్ర గుప్తా కూడా ప్రసిద్ధ బారిష్టర్.

సాధనగుప్తా మరణించినప్పుడు అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ నివాళులర్పిస్తూ "ఆయనలో గాంధేయ నిరాడంబరత, ప్రజాస్వామ్య దృక్కోణం, విలువలకు కట్టుబడి ఉండే లక్షణం" స్పష్టంగా కనిపించేది అన్నారు. సాధన్ గుప్తాకు 1992లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు వచ్చింది.

సమరాంగణం 2024

మాడుగుల హల్వా దక్కేదెవరికి?

- డిప్యూటీ సీఎం బూడి కుటుంబంలో చిచ్చు
- కుమార్తె అనురాధ వైసీపీ నుంచి పోటీ
- కుమారుడు రవి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి
- బండారుకు తప్పిన రెబల్స్ బెడద

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉన్న మాడుగుల నియోజకవర్గం ప్రస్తుతం జిల్లాల విభజన నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో పరిధిలో ఉంది. మాడుగుల నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. మాడుగుల హల్వా అంటే దేశంలోనే ప్రత్యేకత చాటుకుంది. ఈ నియోజకవర్గంలో కె. కోట పాడు, చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల పరిధిలో ఉన్న ఈ నియోజకవర్గంలో తాజాగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అనూహ్యంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా తప్పించి ఆయన కుమార్తె కె కోట పాడు జడ్పిటిసి సభ్యురాలు ఈర్ల అనురాధకు మాడుగుల వైసీపీ టికెట్ కట్టబెట్టారు. అయితే ముత్యాల నాయుడు కుమారుడు బూడి రవి కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి దిగడంతో ముత్యాల నాయుడుకు చిక్కులు ఎదురయ్యాయి. రెండో భార్య కుమార్తె అయిన అనురాధకే తొలినుంచి రాజకీయ వారసత్వం కల్పిస్తున్న ముత్యాల నాయుడు వైఖరిపై కుమారుడు బూడి రవి రాజకీయ పోరాటం మొదలుపెట్టారు.

1952లో ఏర్పడిన మాడుగుల నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా బోజంగి గంగయ్య నాయుడు కేఎల్‌పీ నుంచి ఎన్నిక కాగా, 1955లో పీఎస్ఎల్‌పీ నుంచి దొండ శ్రీరామ మూర్తి ఎన్నికయ్యారు. 1962లో స్వతంత్ర అభ్యర్థిగా తెన్నేటి విశ్వనాథం, 1967లో కాంగ్రెస్ పార్టీ నుంచి రమా కుమారి దేవి, 1972 లో కాంగ్రెస్ పార్టీ నుంచి బొద్దు కళావతి, 1978లో స్వతంత్ర అభ్యర్థిగా కూరచా రామనాయుడు, 1983లో స్వతంత్ర అభ్యర్థిగా రెడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా రెడ్డి సత్యనారాయణ మరోసారి ఎన్నికయ్యారు. 1989, 1994, 1999లో తెలుగుదేశం పార్టీ నుంచి రెడ్డి సత్యనారాయణ ఎన్నికై మంత్రిగా కూడా పనిచేశారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ చేతిలో రెడ్డి సత్యనారాయణ ఓటమి పాలయ్యారు. 2009లో టీడీపీ నుంచి గవిరెడ్డి రామానాయుడు గెలుపొందారు. 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గవిరెడ్డి

బూడి రవి (స్వతంత్ర అభ్యర్థి)

ఈర్లే అనురాధ (వైసీపీ)

బండారు సత్యనారాయణమూర్తి (టీడీపీ)

రామానాయుడుపై వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు గెలుపొందారు. వైసీపీ నుంచి రెండుసార్లు వరుసగా మాడుగుల నుంచి ఎన్నికైన ముత్యాల నాయుడు రెండున్నరేళ్ల క్రితం జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఉప ముఖ్యమంత్రిగా, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

2024లో కూడా ముత్యాల నాయుడుకే మాడుగుల ఎమ్మెల్యే టికెట్ సీఎం జగన్ ప్రకటించినప్పటికీ ఆఖరి నిమిషంలో ఆయనకు అనకాపల్లి ఎంపీగా టికెట్ కేటాయించారు. కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ రావడంతో వైసీపీ నుంచి ఆయనకు దీటైన అభ్యర్థి లేకపోవడంతో ముత్యాల నాయుడును మాడుగుల ఎమ్మెల్యే బరి నుండి తప్పించి ఎంపీగా పోటీలోకి వైసీపీ దింపింది. దీంతో ఆయన కుమార్తె కె. కోట పాడు జడ్‌పీటీసీ సభ్యురాలుగా ఉన్న ఈర్లే అనురాధను మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా వైసీపీ నుంచి బరిలోకి దింపారు. ఆయన కుమారుడు రవి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి దిగారు. దానితో ముత్యాలనాయుడుకు ముచ్చెమటలు పడుతున్నాయి. ముత్యాలనాయుడుకు కుమార్తె, కుమారుడు మధ్య పోటీపై ముత్యాల నాయుడు వర్గీయులు గందరగోళం లోకి పడ్డారు. వైసీపీ గ్యారెంటీగా గెలుచుకుంటుందనుకున్న మాడుగుల నియోజకవర్గంలో ముత్యాల నాయుడు కుటుంబంలో రేగిన అలజడితో వైసీపీలో గందరగోళం నెలకొంది. ఈ ప్రభావం తన అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంపై కూడా పడుతుందని ఆయన మదన పడుతున్నారు.

మరోపక్క కూటమి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తొలిసారి ఆఖరి నిమిషంలో టికెట్ దక్కించుకొని మాడుగుల నుంచి పోటీలోకి దిగారు. తొలుత ఈ నియోజకవర్గ టికెట్‌ను పైలా ప్రసాదరావుకు టీడీపీ ప్రకటించింది. ఇక్కడ టీడీపీ నుంచి టిక్కెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు నామినేషన్ వేసినప్పటికీ టీడీపీ అధిష్ఠానం బుజ్జగింపు చర్యలు చేపట్టడంతో నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో బండారుకు రెబల్ అభ్యర్థుల బెడద తప్పింది.

– విశాలాంధ్ర బ్యూరో, విశాఖపట్నం

మేకతోటి సుచరిత

విడదల రజిని

నూరి ఫాతిమా

మురుగుడు లావణ్య

గల్లా మాధవి

గుంటూరు జిల్లా

అసెంబ్లీ బరిలో మహిళలు

సగం సీట్లలో ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే

గుంటూరు జిల్లాలో రాజకీయ చైతన్యం ఎక్కువ. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు ప్రారంభమైన 1952 నుంచి పురుష అభ్యర్థులదే పైచేయిగా ఉండేది. అప్పటి రాజకీయ పరిస్థితులు, సమీకరణాల నేపథ్యంలో కొన్ని చోట్ల ఒకరిద్దరు మహిళలకు అవకాశం వచ్చేది. తాజా ఎన్నికల్లో మార్పు కనిపిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా ఏడు నియోజకవర్గాలలో సగానికి పైగా స్థానాల్లో ప్రధాన పార్టీల తరుపున మహిళా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. తాడికొండ, గుంటూరు పశ్చిమం, గుంటూరు తూర్పు, మంగళగిరి స్థానాల్లో మహిళా అభ్యర్థులను వైసీపీ నిలబెట్టింది. గుంటూరు పశ్చిమంలో మాత్రమే మహిళా అభ్యర్థికి టీడీపీ అవకాశమిచ్చింది. వైసీపీ తరపున తాడికొండలో మేకతోటి సుచరిత, గుంటూరు పశ్చిమంలో విడదల రజినీ, గుంటూరు తూర్పులో నూరీ ఫాతిమా, మంగళ గిరిలో మురుగుడు లావణ్య పోటీ చేస్తుండగా టీడీపీ తరుపున గుంటూరు పశ్చిమంలో పిడుగురాళ్ల(గల్లా) మాధవి బరిలో ఉన్నారు.

జిల్లా రాజకీయ చరిత్ర...

1952 నుంచి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే తాడికొండ నుంచి 2014లో కత్తెర క్రిస్టినా(వైసీపీ)... తెనాలి శ్రావణ్‌కుమార్(టీడీపీ) చేతిలో ఓటమిపాలయ్యారు. 2019లో ఉండవల్లి శ్రీదేవి (వైసీపీ)... తెనాలి శ్రావణ్‌కుమార్(టీడీపీ)పై గెలుపొందారు. ప్రస్తుతం కత్తెర క్రిస్టినా, ఉండవల్లి శ్రీదేవి టీడీపీలో చేరారు. 1985లో మంగళగిరిలో ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు(టీడీపీ) చేతిలో జమున(కాంగ్రెస్-ఐ) ఓడిపోయారు. 2004లో ఎం.హనుమంతరావు(కాంగ్రెస్-ఐ) చేతిలో టి.జానకీదేవి (బీజేపీ) ఓటమి పాలయ్యారు. 2009లో కాండ్రు కమల(కాంగ్రెస్-ఐ) తన సమీప ప్రత్యర్థి టి.జానకీదేవి (పీఆర్పీ)ని ఓడించారు. తెనాలి నియోజకవర్గంలో 1967లో దొడ్డపనేని ఇందిర(కాంగ్రెస్) తన సమీప ప్రత్యర్థి సీహెచ్ శివరామచౌదరి(ఇండి)పై గెలుపొందారు. ఈమె 1972లో స్వతంత్రంగా పోటీ చేసి నన్నపనేని వెంకట్రావు(కాంగ్రెస్)పై విజయం సాధించారు. 1978లో కూడా దొడ్డపనేని ఇందిర(జనతా)... నన్నపనేని వెంకట్రావు (కాంగ్రెస్-ఐ)పై గెలుపొందారు. 1999లో గోగినేని ఉమ(టీడీపీ)... కొణిజేటి రోశయ్య (కాంగ్రెస్-ఐ)పై విజయం సాధించారు. 2004లో గోగినేని ఉమ(టీడీపీ)... నాదెండ్ల మనోహర్ (కాంగ్రెస్-ఐ) చేతిలో ఓటమి పాలయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2009లో మేకతోటి సుచరిత(కాంగ్రెస్-ఐ) ... కందుకూరి వీరయ్య(టీడీపీ)పై విజయం సాధించారు. 2012లో (ఉ.ప) మేకతోటి సుచరిత వైసీపీ తరుపున పోటీ చేసి కందుకూరి వీరయ్య (టీడీపీ)పై విజయాన్ని అందుకున్నారు. 2014లో మేకతోటి సుచరిత(వైసీపీ)... ఆర్.కిషోర్‌బాబు చేతిలో ఓటమిపాలయ్యారు. 2019లో సుచరిత(వైసీపీ)... డొక్కా మాణిక్యవరప్రసాద్ (టీడీపీ)పై గెలుపొందారు. గుంటూరు పశ్చిమంలో 1985లో గాదె దుర్గాప్రసూనాంబ (టీడీపీ)... సీహెచ్ జయరాంబాబు (కాంగ్రెస్-ఐ) చేతిలో ఓడిపోయారు. 1999లో శనక్కాయల అరుణ(టీడీపీ)... కె.ఈశ్వర వెంకటభారతి (కాంగ్రెస్-ఐ)పై గెలుపొందారు.

– విశాలాంధ్ర బ్యూరో–గుంటూరు

అనుభవం

మేకతోటి సుచరిత...సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకురాలు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి మూడు సార్లు (ఉపతో కలిపి) ఎమ్మెల్యే అయ్యారు. రాష్ట్ర హోం మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు తాడికొండ నుంచి పోటీ చేస్తున్నారు.

విడదల రజిని... మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈమె 2019 ఎన్నికలలో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం గుంటూరు పశ్చిమం నుంచి పోటీ చేయనున్నారు.

నూరీ ఫాతిమా... గుంటూరు తూర్పు మహమ్మద్ ముస్తఫా కుమార్తె. ఈమెకు రాజకీయ అనుభవం లేకపోయినా రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చారు. మొదటిసారి అసెంబ్లీ పదవి కోసం పోటీ చేస్తున్నారు.

మురుగుడు లావణ్య... రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. తల్లి కాండ్రు కమల మాజీ ఎమ్మెల్యే కాగా, మామ మురుగుడు హనుమంతరావు మంత్రిగా చేశారు. ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్నారు.

పిడుగురాళ్ల (గల్లా) మాధవి... టీడీపీ నుంచి గుంటూరు పశ్చిమంలో పోటీ చేస్తున్నారు. ఈమె ఒక ప్రైవేటు హాస్పిటల్‌కు డైరెక్టర్ కాగా భర్త రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నారు. మాధవికి రాజకీయ అనుభవంలేదు. తాజా ఎన్నికలలో విడదల రజినీతో తలపడుతున్నారు.

ఉద్దండుల కోట నరసరావుపేట

- ప్రధాన పార్టీల హోరాహోరీ
- ద్వితీయ శ్రేణి నాయకుల ఫిరాయింపుల జోరు

రాజకీయ ఉద్దండుల కోట... పౌరుషాల పురిటిగడ్డ.... పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట. నరసరావు పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నికలు ఉత్కంఠభరితంగా మారాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు సాగబోతోంది. ఇండియా కూటమి తరుపున జి.అలెగ్జాండర్ సుధాకర్ పోటీ చేస్తుండగా ఎన్డీయే తరపున టీడీపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు, వైసీపీ తరపున పి.అనిల్ కుమార్ యాదవ్ పోటీ చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో త్రిముఖ పోటీ జరగబోతోంది. వైసీపీ, టీడీపీ అభ్యర్థులు సొంత అజెండాలతో ఒంటెద్దు పోకడలు పోతున్నారన్న అభిప్రాయం స్థానికుల్లో ఉన్నది. దీంతో ఇండియా కూటమికి మొగ్గు చూపే అకాశాలు ఉన్నాయి. ఈసారి ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీ మాత్రమే వస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు ద్వితీయశ్రేణి నాయకులు పూటకో పార్టీ మారుతూ అభ్యర్థులకు ఝలక్ ఇస్తున్నారు.

వైసీపీ, టీడీపీ తరపున స్థానికేతరులు బరిలో నిలిచారు. వీరిలో ఒకరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాగా మరొకరు ఎంపీ.నెల్లూరు అర్బన్ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అభ్యర్థిగా బరిలో నిలిచారు. 2019లో వైసీపీ ఎంపీగా గెలిచి...రెండు నెలల కిందట వైసీపీ ఉన్న లావు కృష్ణదేవరాయలు ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా పోటీకి దిగారు.

జి.అలెగ్జాండర్

పి.అనిల్ కుమార్

లావు శ్రీకృష్ణదేవరాయలు

2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిపై టీడీపీ అభ్యర్థి మోదుగుల వేణుగోపాల్ రెడ్డి 1,607 ఓట్లతో గెలిచారు. ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశమున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అభ్యర్థుల గెలుపోటములను వారి సామాజిక వర్గం ఓట్లు నిర్దేశిస్తాయన్న అభిప్రాయమున్నది.

1952లో నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గం ఏర్పడింది. తొలి ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గానికి చెందిన సీఆర్ చౌదరి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. ఆపై జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు కాంగ్రెస్, ఆరుసార్లు కాంగ్రెస్ ఐ, నాలుగుసార్లు టీడీపీ, ఒకసారి వైసీపీ విజయం సాధించాయి. సామాజిక వర్గం ఆధారంగా చూస్తే... ఏడుసార్లు రెడ్డి సామాజిక వర్గం, ఐదుసార్లు కమ్మవారు, మూడుసార్లు వైశ్య సామాజిక వర్గ అభ్యర్థులు గెలుపొందారు. గతంలో నరసరావుపేటకు ప్రాతినిధ్యం వహించిన కాసు బ్రహ్మానంద రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా పనిచేశారు. ఎన్.జనార్దన్ రెడ్డి, కొణిజేటి రోశయ్య కూడా ముఖ్యమంత్రులయ్యారు. దీంతో నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి రాజకీయాల్లో ప్రత్యేక స్థానం దక్కింది. తాజా ఎన్నికల్లో బీసీ యాదవ్ అభ్యర్థిని వైసీపీ నిలబెట్టింది. నియోజకవర్గంలో యాదవుల ఓట్లు 1.17 లక్షల మేర ఉన్నాయి. రెడ్డి వర్గం ఓట్లు 2.15 లక్షలుగా ఉన్నాయి. నరసరావు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని అనిల్ కుమార్ యాదవ్ దీమాగా ఉన్నారు. మరోవైపు ఐదేళ్లలో ఎంపీగా తాను చేసిన పనులే తనను గెలిపిస్తాయని లావు శ్రీకృష్ణదేవరాయలు భావిస్తున్నారు. ఒంటెద్దు పోకడలు పోతున్న స్థానికేతర అభ్యర్థులను కాకుండా స్థానికుడైన ఇండియా కూటమి అభ్యర్థిని గెలుపించుకోవాలన్న అభిప్రాయం స్థానికుల్లో ఉన్నట్లు తెలుస్తోంది.



– విశాలాంధ్ర బ్యూరో, పల్నాడు జిల్లా

సీపీఐ గెలిస్తే ప్రజావిజయం

- పెత్తందారులను తరిమికొట్టండి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- విజయవాడ పశ్చిమ సీపీఐ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో

విశాలాంధ్ర-విజయవాడ: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరుప్రఖ్యాతలు ఉన్న విజయవాడ నగరంలో ఈ ఎన్నికల్లో పశ్చిమ నియోజక వర్గం నుంచి సీపీఐ అభ్యర్థి గెలిస్తే అది ప్రజా విజయం అవుతుందని, బీజేపీ గెలిస్తే డబ్బుకే ప్రజలు పట్టం కట్టినట్లు అవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రజల కోసం కష్టపడే వ్యక్తి నిత్యం మీతోనే ఉండే సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావును ఈ ఎన్నికల్లో గెలిపించాలని రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, సీపీఎం బలపర్చిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, విజయవాడ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వల్లూరు భార్గవ్ విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో రోడ్ షో ప్రారంభం సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్దేశించేలా జరుగుతున్న ఈ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.కోటేశ్వరరావు గతంలో కార్పొరేటర్‌గా పని చేసి ప్రజాసమస్యలను పరిష్కరించారని చెప్పారు. సామాన్య కార్యకర్తగా ప్రజల మధ్య ఉండే కోటేశ్వరరావును గెలిపిస్తే చట్ట సభల్లో ప్రజాగొంతుక వినిపిస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వల్లూరు భార్గవ్‌కు 'హస్తం' గుర్తుపై, సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావుకు 'కంకి-కొడవలి' గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి సామాన్య వ్యక్తికాదని, ఈ నియోజకవర్గంలో ఉండరని, పెత్తందారులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో మోదీ పదేళ్ల పాలనలో చేసిన పనులు చెప్పు కోవటానికి ఏమీ లేక మెజార్టీ హిందువులను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి ఓట్లు పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్ వద్ద ఒక్క రూపాయి దొరక్కపోయినా జైలులో పెట్టారని, చంద్రబాబును జైలుకు పంపించి లొంగదీసుకున్నారని చెప్పారు. ఇలా దేశంలో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు మల్నీడి యల్లమందరావు, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్ దోనేపూడి శంకర్, సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీరంకి రామచంద్రరావు, సీపీఎం నాయకులు బోయ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులు

నాలుగు స్తంభాల సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలీసుల అత్యుత్సాహం

రోడ్డు షో సందర్భంగా మైక్ ప్రచార ఆటోకు సపోర్టుగా మరో ఆటోను ర్యాలీలో ఉంచారు. పోలీసులు రెండవ ఆటోకు అనుమతి లేదని చెప్పడంతో ఆ ఆటోను పక్కన పెట్టారు. అయినా పోలీసులు ఆటో డ్రైవర్‌ను, డప్పు కళాకారుడిని భవానీపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టారు. అ సమాచారం తెలుసుకున్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ర్యాలీని అనుసరిస్తున్న పోలీసులను ప్రశ్నించారు. మీ సూచన మేరకు ఆటోను పక్కన పెట్టినా ఆటో డ్రైవర్‌ను, కళాకారుడిని పోలీసు స్టేషన్ తీసుకెళ్లి ఎందుకు కొట్టారని నిలదీశారు. పోలీసులు ఏదో ఒక కారణం చెప్పటానికి ప్రయత్నించగా వెంటనే వారిని విడిచిపెట్టకపోతే నాలుగుస్తంభాల సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన వారిని విడిచిపెట్టారు.

ప్రజల హర్షాతిరేకాలు

'ఇండియా' కూటమి అభ్యర్థులు వల్లూరు భార్గవ్, జి.కోటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ నగర సమితి అధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. రహదారికి రెండువైపులా ప్రజలు నిలబడి నాయకులకు స్వాగతం పలికారు. డాబాలపై నిలబడి, షాపుల ముందు నిల్చొని, చిరువ్యాపారులు ఎదురొచ్చి నాయకులను పలుకరించారు. ఎర్రచీరలు ధరించిన మహిళా సమాఖ్య నాయకులు, రెడ్ షర్ట్ వాలంటీర్లు రెండు వరుసలుగా క్రమపద్ధతిలో నడుస్తూ నగర వాసులను ఆకర్షించారు. ముందుగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర నాయకులు షేక్ నజీర్, ఎన్నికల ప్రచార గీతాలు ఆలపించారు. ఆటోల ద్వారా కార్యకర్తలు చేసిన మైక్ ప్రచారం ఆకట్టుకుంది. కుమ్మరిపాలెం సెంటర్ వద్ద ప్రారంభమైన రోడ్ షో నాలుగు స్తంభాల సెంటర్, చెరువు సెంటర్, సితార సెంటర్ వరకు సాగింది.

మీ తీర్పు... చరిత్ర తిరగరాయాలి

గుంటూరు పార్లమెంటు సీపీఐ అభ్యర్థి జంగాల

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు పార్లమెంట్ ధనవంతుల అడ్డాగా మారింది... వారు వస్తారు... ఎన్నిక లలో పెట్టుబడి పెడతారు... గెలిచాక ఊరు వదిలి వెళ్లిపోతారు... గుంటూరు పార్లమెంట్‌లో ఇది పరిపాటిగా మారింది... ఈ చరిత్రను తిరగ రాయాలి... అందుకు ఈ ఎన్నికలలో మీరిచ్చే తీర్పు నాంది కావాలని గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ ఓటర్లకు పిలుపునిచ్చారు. 'ఇండియా' కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి జంగాల మంగళవారం పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్‌కు కంకి-కొడవలి గుర్తుపై ఓట్లు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపిం చాలని ఓటర్లను అభ్యర్థించారు. కరపత్రాలను పంచుతూ 'ఇండియా' కూటమి గెలుపు అవసరాన్ని వారికి వివరించారు. అనంతరం జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బిల్డ్ ఏపీ పేరుతో గుంటూరు నడిఒడ్డున ఉన్న పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌ను వేలం వేయడానికి ప్రయత్నం చేస్తే కరోనాను సైతం లెక్కచేయకుండా నిరసన ప్రదర్శనలు నిర్వహించి వేలంను అడ్డుకున్న చరిత్ర సీపీఐది అని అన్నారు. చిరు వ్యాపారుల ఉపాధిని నిలబెట్టిందన్నారు. ఆ పోరాటంలో తాను కూడా భాగస్వామిగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మోసకారుల మాటలు నమ్మవద్దని, పోరాడే వారిని గెలిపిస్తే ఆపదలో ఉన్నప్పుడు వారు తోడుంటారని చెప్పారు. తాను గెలిస్తే ఎంపీ నిధుల నుంచి పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ ఆధునీ కరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ పీవీకే కూరగాయల మార్కెట్‌తో పాటు వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని, నల్లపాడులోని స్థలాన్ని వైసీపీ ప్రభుత్వం అమ్మకానికి పెడితే వివిధ రూపాలలో సీపీఐ ఆందోళన నిర్వహించిందని గుర్తుచేశారు. కంకి-కొడవలి గుర్తుపై ఓటు వేసి జంగాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, నగర సమితి సభ్యులు జంగాల చైతన్య, కొల్లి రంగారెడ్డి, కంజుల విఠల్ రెడ్డి, దూపాటి రత్నం, నూతల పాటి చిన్న, ఆర్యా వెంకట రమణ, ఇందుర్తి బాబురావు, దేవి రెడ్డి, రవి బాబు, ఆర్య వరలక్ష్మి, బండి కృష్ణ, ఏడుకొం డలు, మర్రి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించండి

ముప్పాళ్ల, కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-తాడికొండ: ఎన్‌డీఏను ఓడించి... 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ సీపీఐ కార్యాలయంలో తాడికొండ, పెదకూరపాడు నియోజకవర్గాల ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ల, కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయటమే సరిపోయిందని మండిపడ్డారు. 2014 ముందు గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని దుయ్యబట్టారు. మోదీ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని దేశ ప్రజలకు హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని నిలదీశారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో మతోన్మాదం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇండియా' కూటమి బలపరచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంచాల సుశీల్ రాజాను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకర్రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామకృష్ణ, పొన్నెకల్లు గ్రామ కార్యదర్శి రామినేని రామారావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, పార్టీ నాయకులు కె.శ్రీనివాసరావు, గుర్రంకొండ సత్యానందం, రామినేని నరసింహారావు, కోట భారతి గ్రామస్తులు పాల్గొన్నారు.

విమలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-విశాఖ: ఎన్నికల్లో సింహం సింగిల్ గా వస్తుందని ఒక పార్టీ, ప్రజల కోసం జతకట్టామని ఒక కూటమి చెబుతున్నాయని... వారిలో ఎవరికి ఓటు వేసినా దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్న నరేంద్ర మోదీకి ఓటు వేసినట్టేనని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు అన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని కంచరపాలెం మెట్టు వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి బలపరిచిన విశాఖ పశ్చిమ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో జగన్, చంద్రబాబు, పవన్ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందన్నారు. సంపదను సృష్టించే ప్రయత్నమేది జరగలేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మారుస్తుందని, ఆ విషయాన్ని ఆ పార్టీ నేతలే స్వయంగా చెబుతున్నారన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే ప్రజలు, కార్పొరేట్ సంస్థల ఆస్తులను స్వాధీనం చేసుకుని ముస్లింలకు పంచుతారని ప్రధాని మోదీ ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. హిందువుల ఓట్లను రాబట్టేందుకే ఇలాంటి దారుణమైన ప్రసంగాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడం చారిత్రక అవసరమని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంశాన్ని వైసీపీ మేనిఫెస్టోలో గానీ, ఎన్డీఏ ఉమ్మడి మేనిఫెస్టోలో గానీ పెట్టలేదని చెప్పారు. సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలను గెలిపిస్తే స్టీల్ ప్లాంట్ కోసం పోరాటం చేస్తారని, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ దేశ ప్రజల భవిష్యత్తును ఈ ఎన్నికలు నిర్ణయించనున్నాయని చెప్పారు. మోదీ పదేళ్ల పాలనలో పెట్రోలు, డీజిల్ సహా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. సీపీఎం నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ బీజేపీ పాలనలో సామాన్యులు బతకటం కష్టంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఇష్టానుసారం ప్రైవేటుపరం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, అభ్యర్థి అత్తిలి విమల, విదసం రాష్ట్ర అధ్యక్షులు బూసి వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, ఎస్కే రెహమాన్, మన్మధరావు, క్షేత్రపాల్, నేతలు జేడీనాయుడు, ఈశ్వరరావు, నల్లయ్య, బేగం తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తాం

కమలాపురం సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర

విశాలాంధ్ర-కమలాపురం: చెన్నూరు చెక్కర పరిశ్రమను తిరిగి తెరిపిస్తామని కమలాపురం అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర ఓటర్లకు హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన చెన్నూరు, చిన్నమాచుపల్లె, శేషయ్య గారి పల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెన్నూరు చెక్కర పరిశ్రమ చంద్రబాబు ప్రభుత్వంలో మూతబడిందన్నారు. ఈ పరిశ్రమ తిరిగి తెరుచుకుంటే చెన్నూరు పరిసర ప్రాంతాల రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఇప్పటివరకు గెలిచిన ఎమ్మెల్యేలందరూ చెన్నూరు చెక్కర పరిశ్రమ తెరిపిస్తామని ఎన్నికల్లో చెప్పారే గానీ ఆచరణలో చేసిందేమీ లేదన్నారు. చెన్నూరు పరిశ్రమ కోసం సీపీఐ గతంలో అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. ఇప్పుడు ఇండియా కూటమి తరపున కమలాపురం నుంచి పోటీచేస్తున్న తనను గెలిపిస్తే... శాసనసభలో పోరాడి చెక్కర పరిశ్రమను తెరిపిస్తానని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న రైతులకు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి నుంచి కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్ షర్మిలను హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని... అలాగే కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను కంకి కొడవలి గుర్తుపైన ఓట్లు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని గాలి చంద్ర ఓటర్లను కోరారు.

'బండి' గెలుపుతోనే ఏలూరు అభివృద్ధి: డేగా ప్రభాకర్



విశాలాంధ్ర-ఏలూరు: నిత్యం ప్రజల పక్షాన పోరాడే ఇండియా కూటమి బలపర్చిన ఏలూరు అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం చొదిమెళ్ళ, రాజరాజేశ్వరి నగర్, బాలాజీ నగర్, టైటస్ నగర్, అశోక్ నగర్, నరసింహారావు పేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రభాకర్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి బండి వెంకటేశ్వరరావుకు కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తంగెళ్లమూడి సెంటర్లో జరిగిన ప్రచార సభలో డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీకి మరోసారి అవకాశం ఇస్తే దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో భారీ కుంభకోణాలకు పాల్పడ్డ గజదొంగలంతా బీజేపీ లోనే ఉన్నారని విమర్శించారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని... అందుకే తప్పుడు కేసులతో ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన ఏ ఒక్క హామీని జగన్ సాధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న బీజేపీని, దానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తున్న పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఏలూరు నగరంలో సమస్యలు తిష్ఠ వేశాయని... స్థానిక శాసన సభ్యుని హయాంలో నగరం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య, తమ్మిలేరుకు అమీనాపేట వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం, మురికివాడల అభివృద్ధి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి బండి వెంకటేశ్వరరావుకు ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు పార్లమెంటుకు పోటీ చేస్తున్న కావూరి లావణ్య కు హస్తం గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏఐటీయూసీ నాయకులు కడుపు కన్నయ్య, గేదెల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి గౌర్లి స్వాతి, సీపీఎం నగర నాయకులు బుగత జగన్నాథం, జి. కోటేశ్వరరావు, ఎం.ఇస్సాక్, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మురళికి విజయం చేకూర్చండి

విశాలాంధ్ర-తిరుపతి: అసెంబ్లీ ఎన్నికల్లో రౌడీ మూకలు అల్లర్లు సృష్టించి ప్రశాంత వాతావరణం కలుషితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని , ఎన్నికలను సజావుగా జరిపించేందుకు ఎన్నికల కమిషన్ (ఈసీ) కృషిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి అన్నారు. ఇండియా కూటమి బలపరిచిన తిరుపతి అసెంబ్లీ అభ్యర్థి పి.మురళి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మధురానగర్, సప్తగిరి నగర్, టీటీడీ పరిపాలనా భవనం తదితర ప్రాంతాల్లో ఇంటింట ప్రచారం గావించారు. ఓట్లు అభ్యర్థించారు. హరినాథరెడ్డి మాట్లాడుతూ తిరుపతి అసెంబ్లీకి జాతీయ గుర్తింపు గల పార్టీలు 16 మంది పోటీ చేస్తే, స్వతంత్ర అభ్యర్థులుగా మరో 30 మంది నామినేషన్లు వేయడం గమనిస్తే బయటి జిల్లాల వ్యక్తులు అల్లర్లకు పాల్పడే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతిలో ఇప్పటికే రెండు ప్రధాన పార్టీలు చేసుకుంటున్న పరస్పర విమర్శలు ప్రచార సరళి మంచినీళ్ల ప్రాయంగా ఎన్నికల ఖర్చు చేయడం గమనిస్తే ఎవరికైనా బోధ పడుతుందన్నారు. ఎన్నికల కమిషన్... రూ.40 లక్షలు మాత్రమే అసెంబ్లీ కి పరిమితి విధించగా, నేడు రోజుకు కోటి వరకు ఖర్చు చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల వ్యయపరిశీలకులు అప్రమత్తంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. తిరుపతి అభివృద్ధి కోసం నిత్యం పోరాడుతున్న మురళి గుర్తు కంకి కొడవలికి ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యులు టి.జనార్ధన్, సీ పెంచలయ్య , శివారెడ్డి , విశ్వనాద, రాధా కృష్ణ, ప్రసాద్, నదియా, ఎన్.డి .రవి, రామచంద్ర, రాజా, రవి, గోవింద స్వామి పాల్గొన్నారు.

పత్తికొండను అభివృద్ధి చేస్తా

రామచంద్రయ్య హామీ

విశాలాంధ్ర-కృష్ణగిరి: ఇండియా కూటమి బలపర్చిన పత్తికొండ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్య మంగళవారం కర్నూలు జిల్లా కృష్ణగిరి మండల పరిధిలోని బొంతిరాళ్ల, ఆలంకొండ కంబాలపాడు, లక్కసాగరం, లాల్‌మాన్ పల్లె, చుంచు ఎర్రగుడి, బాపలదొడ్డి, కృష్ణగిరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే పత్తికొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి తనను, హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంటు అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నాయని... రైతుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రైతులకు మేలు చేసే నాయకులకు ఓట్లు వేయాలన్నారు. మోదీపాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని... బడా కార్పొరేటర్ శక్తులకు మోదీ ప్రభుత్వం కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. ప్రజలను పట్టించుకోని పాలకులను ఓటుతో తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కటారుకొండ సర్పంచ్ లెనిన్ బాబు, బోయ బొంతిరాళ్ల సర్పంచ్ రవి మోహన్, మండల కార్యదర్శి ఖలీల్, సీపీఐ నాయకులు విరుపాక్షి, నాగేంద్రయ్య, సీపీఎం నాయకులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్, ఏపీ ప్రజా నాట్యమండలి నాయకులు నాగరాజు, వెంకటరాముడు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.